RNI NO. TELTEL/2022/83470
●manasakshi.in

# మనసాక్షి
మీకోసం

తెలుగు దినపత్రిక
ఎడిటర్: మల్లె నాగిరెడ్డి

నల్గొండ | హైదరాబాద్ | సంపుటి : 4. సంచిక :192 | శుక్రవారం 27 మార్చి 2026 | పేజీలు 8 | వెల: రూ.1.00 | epaper.manasakshi.in

## ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్ పేరుతో మోసాలు

ముఠాను అరెస్ట్ చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు

హైదరాబాద్: ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్ పేరుతో మోసాలకు పాల్పడుతున్న ముఠాను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. రాజేశ్ వెంకట్ రామన్, అభిషేక్, విలియమ్స్, మన్మీత్ శర్మ ముఠాగా ఏర్పడి రూ.26 కోట్ల మేర అక్రమ లాలాదేవీలు జరిపినట్లు పోలీసులు గుర్తించారు. నకిలీ పేమెంట్ గేట్‌వేలను నిందితులు తయారు చేసినట్లు విచారణలో వెల్లడైంది. యూపీఐ, ఐఎంపీఎస్ కార్డ్ ట్రాన్సాక్షన్‌ల ద్వారా డబ్బులు మళ్లించినట్లు పోలీసులు విచారణలో తేల్చారు. ప్రతి లావాదేవీపై 2 శాతం నుంచి 5శాతం వరకు కమిషన్ వసూలు చేసినట్లు గుర్తించారు. ఫేక్ కంపెనీల పేర్లతో మ్యూల్ ఖాతాలు



సృష్టించి, నగదు లావాదేవీలు జరిపినట్లు గుర్తించారు. సూర్యోదయ బ్యాంక్ ద్వారా పేమెంట్ గేట్‌వే సేవలు వినియోగించినట్లు ఆధారాలు సేకరించారు. నిందితుల నుంచి 4 ల్యాప్‌టాప్‌లు, 6 మొబైల్స్, 9 చెక్‌బుక్‌లు, రూ.6.5 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న మరికొంత మంది నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.



2లో

# భద్రాచలం అభివృద్ధికి మొత్తం రూ.586 కోట్ల నిధులు

అందుకు సంబంధించిన ఏర్పాట్లను మంత్రి తుమ్మల పరిశీలించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. శ్రీసీతారామచంద్రస్వామి దంపతులకు ప్రభుత్వం తరపున ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలను సీఎం రేవంత్ రెడ్డి సమర్పించనున్నారని తెలిపారు. అందుకు శుక్రవారం భద్రాచలానికి సీఎం రేవంత్ వస్తున్నారన్నారు.

మొదటి దశలో రూ.351 కోట్లతో పనులు ప్రారంభం

నేటు కళ్యాణోత్సవానికి హాజరవుతున్న సిఎం రేవంత్

ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి తుమ్మల నాగేశ్వర రావు



## గత ప్రభుత్వం బకాయిలు కడుతున్నాం

- ఆరోగ్యశ్రీ కింద 600 కోట్ల బకాయిలు పెట్టి వెళ్లారు
- ఇప్పటివరకు రూ.2,408 కోట్ల బిల్లులు చెల్లించాం
- విద్య,వైద్యానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నాం
- సిఎంఆర్‌ఎఫ్ నిధులను దుర్వినియోగం చేశారు
- అన్ని బాగోతాలు బయటపెట్టబోతున్నాం
- అసెంబ్లీలో సిఎం రేవంత్ రెడ్డి

గత ప్రభుత్వంలో సీఎంఆర్‌ఎఫ్ నిధులను కొందరు తమ సొంత ఖాతాల్లో వేసుకున్నారని, దీనిపై విచారణ జరుగుతోందన్నారు. త్వరలోనే అన్నీ బయటకు వస్తాయని హెచ్చరించారు. తాము అధికారంలోకి వచ్చాక 27 నెలల్లో రూ.2,046 కోట్ల సీఎంఆర్‌ఎఫ్ కింద ఇచ్చామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం అప్పుల భారాన్ని తమకు వారసత్వంగా ఇచ్చిందని, ఆ బకాయిలను తామే చెల్లిస్తున్నామని రేవంత్ రెడ్డి చెప్పారు.

-2లో

## ఏప్రిల్ 2నుంచి 5 మండలాల్లో ఇంటిగ్రేటెడ్ భూభారతి



-2లో

- సర్వే నుంచి రిజిస్ట్రేషన్ వరకు..
- అంతా ఒకే గొడుగు కిందకు
- ఒకే క్లిక్‌తో సమస్త భూ సమాచారం
- ప్రతి సర్వేనెంబర్‌కు భూధార్ నెంబర్

రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



2లో

## నేడు రాష్ట్రాల సిఎంలతో ప్రధాని వీడియో కాన్ఫరెన్స్

పశ్చిమాసియా పరిస్థితులపై రాష్ట్రాలకు వివరించే ఛాన్స్



2లో

## ఆరోగ్యశ్రీపై అబద్దాలు చెప్పే ప్రయత్నం

మైక్ కట్ చేయడం ద్వారా నిజాలు దాచారు

మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు

## కవిత కొత్త పార్టీ తెలంగాణ ప్రజా జాగృతి

నేడు నిజామాబాద్ వేదికగా ప్రకటన

రాజకీయ నిర్ణయాలు ప్రకటించే అవకాశం



నిజామాబాద్: తెలంగాణ రాజకీయాల్లో పెను సంచలనం సృష్టిస్తూ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత తన సొంత రాజకీయ పార్టీని ప్రకటించేందుకు సిద్ధమయ్యారు. తన రాజకీయ ప్రస్థానానికి పునాది వేసిన నిజామాబాద్ వేదికగానే ఈ కీలక నిర్ణయాన్ని వెల్లడించబోతున్నారు. శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని నిజామాబాద్‌లోని జాగృతి కార్యాలయంలో నిర్వహించే అధికారిక సమావేశంలో 'తెలంగాణ ప్రజా జాగృతి' పేరుతో కొత్త పార్టీని ఆమె ప్రకటించనున్నారు. పార్టీ ఆవిర్భావ వేడుకల తేదీని కూడా అదే వేదిక నుంచి వెల్లడించేందుకు సర్వం సిద్ధమైంది. రాబోయే నెలలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభలో పార్టీ జెండా, అజెండా , పార్టీ గుర్తును ప్రజల ముందుకు తీసుకురావాలని కవిత భావిస్తున్నారు. ఈ పార్టీ ఆవిర్భావ వేడుకల్లో పెద్ద ఎత్తున చేరికలు ఉండేలా ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేశారు.

## కడియం , సంజయ్‌లపై విచారణ విచారణ ఏప్రిల్ 16కు వాయిదా



హైదరాబాద్: పార్టీ మారలేదని పేర్కొంటున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, సంజయ్‌ల వ్యవహారంపై హైకోర్టులో విచారణ జరిగింది. ఈ కేసులో ఇద్దరు ఎమ్మెల్యేలతో పాటు అసెంబ్లీ స్పీకర్‌కు కోర్టు నోటీసులు జారీ చేసింది. ఇటీవల కడియం శ్రీహరి, సంజయ్ పార్టీ మారలేదని అసెంబ్లీ స్పీకర్ తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే.అయితే, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు జగదీశ్వర్ రెడ్డి, కెపి వివేకానంద స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో కడియం శ్రీహరి, సంజయ్‌లకు కౌంటర్ దాఖలు చేయాలని కోర్టు ఆదేశించింది. ఇప్పటికే ఈ వ్యవహారం రాజకీయంగా చర్చనీయాంశంగా మారగా, కోర్టు విచారణపై అన్ని వర్గాల్లో ఆసక్తి నెలకొంది. తదుపరి విచారణను వచ్చే నెల 16వ తేదీకి వాయిదా వేసింది.

## అసెంబ్లీ జరుగుతుంటే ఆటలేంటి?



హైదరాబాద్: అసెంబ్లీ సమావేశాల్లో అత్యంత కీలక అంశాలపై చర్చ జరుగుతున్న సందర్భంలో.. ఎమ్మెల్యేలకు ఆటల పోటీలు నిర్వహించడం సరికాదని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. అసెంబ్లీ లాబీలో ఆయన గురువారం మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. "ప్రభుత్వం ప్రజాసమస్యల పట్ల బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోంది. ఇరిగేషన్ వంటి అత్యంత ముఖ్యమైన సబ్జెక్టులపై సభలో లోతైన చర్చ జరగాల్సి ఉంది. కానీ, ప్రభుత్వం మాత్రం పద్దులపై చర్చను త్వరగా ముగించాలని చూస్తోంది. కీలకమైన అంశాలపై చర్చలు జరగాల్సిన 28, 29 తేదీల్లో ఎమ్మెల్యేలు మైదానాల్లో ఆటలు ఆడుతుంటే.. సభను చూస్తున్న ప్రజలు ఏమనుకుంటారు? ఈ విషయాన్ని నేను మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్తే.. ఆయన వద్ద ఎటువంటి సమాధానం లేదు. అసెంబ్లీ సమావేశాల కాలాన్ని ప్రజాప్రయోజనాల కోసం ఉపయోగించకుండా.. ఇలాంటి కార్యక్రమాలతో కాలయాపన చేయడం సరికాదు. పద్దులపై చర్చకు తగినంత సమయం కేటాయించకుండా ఎమ్మెల్యేల క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వడం ప్రభుత్వ చిత్తశుద్ధి లేమికి నిదర్శనం. ప్రతిపక్షాలు అడుగుతున్న ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేకే ఈ క్రీడా పోటీలను ప్రభుత్వం ఒక సాకుగా చూపిస్తోంది" అని కేటీఆర్ విమర్శించారు.



## మార్కాపురంలో మృత్యు ఘోష

మార్కాపురం మృతులకు కేబినెట్ సంతాపం మృతుల కుటుంబాలకు

5లక్షల చొప్పన పరిహారం క్షతగాత్రులకు 2 లక్షల పరిహారం ఇవ్వాలని నిర్ణయం

ఘటనాస్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ప్రమాదంతో బస్సు, టిప్పర్ పూర్తిగా దగ్ధమయ్యాయి. బస్సును హరికృష్ణ ట్రావెల్స్‌కు చెందినదిగా గుర్తించారు. గురువారం తెల్లవారు జామున ఆరుగంటల సమయంలో ఈ ఘోరం జరిగింది. ఘటనాస్థలికి పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

- మార్కాపురం వద్ద ఘోర బస్సు ప్రమాదం
- టిప్పర్‌ను ఢీకొని మంటల్లో దగ్ధం
- 14మంది ప్రయాణికుల మృతి
- పలువురికి తీవ్ర గాయాలు

మార్కాపురం బస్సు ప్రమాదం దారుణం బాధ్యుతలపై చర్యలు తప్పవన్న మంత్రి మండిపల్లి



-2లో

# మార్కాపురంలో మృత్యుఘోష

మార్కాపురం: మార్కాపురం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రాయవరం సమీపంలో పలకల క్వారీల వద్ద టిప్పర్‌ను ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. దీంతో బస్సుతో పాటు టిప్పర్‌లోనూ మంటలు చెలరేగాయి. ప్రమాదంలో బస్సులోని 13 మంది ప్రయాణికులు సజీవ దహనమయ్యారు. వారి మృతదేహాలను వెలికితీశారు. మరో 28 మందికి గాయాలయ్యాయి. ఘటనాస్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ప్రమాదంతో బస్సు, టిప్పర్ పూర్తిగా దగ్ధమయ్యాయి. బస్సును హరికృష్ణ ట్రావెల్స్‌కు చెందినదిగా గుర్తించారు. గురువారం తెల్లవారు జామున ఆరుగంటల సమయంలో ఈ ఘోరం జరిగింది. ఘటనాస్థలికి పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను మార్కాపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముంది. బస్సు తెలంగాణలోని జగిత్యాల నుంచి నెల్లూరు జిల్లా కనిగిరికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఘటన జరిగిన సమయంలో బస్సులో 41 మంది



ప్రయాణికులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. వీరిలో బస్సు వెనుక భాగంలో ఉన్నవారు బయటకు రాలేక మృతిచెందినట్లు తెలుస్తోంది. ముందు భాగంలో ఉన్నవారు ప్రాణాలతో బయటపడ్డారు. మృతుల్లో కనిగిరి, వింజమూరు, ఉదయగిరి ప్రాంతాలకు చెందిన వారు ఉన్నట్లు సమాచారం. ఘటనాస్థలాన్ని మార్కాపురం జేసీ శ్రీనివాసులు, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పరిశీలించారు. మృతుల వివరాలు.. సీహెచ్ మనోజ్‌కుమార్ (18), వింజమూరు, సీహెచ్ సుజాత (45), వింజమూరు, సీహెచ్ మేఘన (19), వింజమూరు, టి. నరేంద్ర (25), నల్లగొండ్ల, టి. చందన (21), నల్లగొండ్ల, టి. చందు (6), నల్లగొండ్ల , కె. ప్రకాశ్ (17), అయ్యవారిపల్లె, కె.అయ్యన్న (18), (ఎర్రబొట్లపల్లె) వి. గురవయ్య (60), చింతగుంట్ల, కె.అబ్రహం (42), చోడవరం, పి.మహేంద్రరెడ్డి (17), చోడవరం రామచంద్ర ప్రవీణ్ (21), చోడవరం, ఎ.సౌజన్య (22), పెదారికట్ల ఉన్నారు. ఈ ప్రమాదంపై సీఎం చంద్రబాబు,ప్రధాని మోడీ, మంత్రులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బస్సులోని పలువురు ప్రయాణికులు సజీవ దహనం కావడంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. జిల్లా అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. తెలంగాణలోనినిర్మల్ నుంచి నెల్లూరుకు ఈ బస్సు వెళుతున్నట్లు అధికారులు తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలన్నారు. ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణ జరిపి నివేదిక సమర్పించాలని సీఎం ఆదేశించారు.

బస్సు ప్రమాదంపై మంత్రులు నారా లోకేశ్, గొట్టిపాటి రవికుమార్, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, బీసీ జనార్దన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు.

# భద్రాచలం అభివృద్ధికి మొత్తం రూ.586 కోట్ల నిధులు

భద్రాచలం: శ్రీ రాముడు నడయాడిన భద్రాచలంలో శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయం అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి పెద్ద మనస్సుతో నిధులు మంజూరు చేశారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. మొదటి దశలో రూ.351 కోట్లతో చేపట్టే పనులకు తెలంగాణ సీఎం శంకుస్థాపన చేస్తారని తెలిపారు. మొత్తం రూ.586 కోట్లతో రామాలయంతో పాటు భద్రాచలం పట్టణాభివృద్ధిని మూడు దశల్లో అభివృద్ధి చేసేందుకు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేశామన్నారు. శుక్రవారం శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలోని మిథిలా కళ్యాణ మండపం వేదికగా స్వామివారి కళ్యాణం జరుగుతుంది. అందుకు సంబంధించిన ఏర్పాట్లను మంత్రి తుమ్మల పరిశీలించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. శ్రీసీతారామచంద్రస్వామి దంపతులకు ప్రభుత్వం తరపున ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలను సీఎం రేవంత్ రెడ్డి సమర్పించనున్నారని తెలిపారు. అందుకు శుక్రవారం భద్రాచలానికి సీఎం రేవంత్ వస్తున్నారన్నారు. ఆయనకు ప్రజల తరపున ఘనంగా స్వాగతం పలుకుతామని చెప్పారు. భద్రాచలం వచ్చే భక్తుల సౌకర్యార్థం జాతీయ రహదారులు, రైల్వే కనెక్టివిటీ, ఎయిర్ పోర్టు ఏర్పాటు దిశగా అడుగులు వడివడిగా పడుతున్నాయన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యాక గోదావరిలో నావిగేషన్ సిస్టమ్ ఏర్పాటుకు అవకాశం ఉందని మంత్రి తుమ్మల ఆశాభావం వ్యక్తం చేశారు. వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహించేందుకు ఇప్పటి నుంచే పనులు చేపట్టినట్లు చెప్పారు. సీతారాముల కళ్యాణం వీక్షించే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నామన్నారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లపై దేవాలయం అధికారులు, సిబ్బందికి మంత్రి తుమ్మల దిశా నిర్దేశర చేశారు.?

# ఆరోగ్యశ్రీపై అబద్ధాలు చెప్పే ప్రయత్నం

**మైక్ కట్ చేయడం ద్వారా నిజాలు దాచారు మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు**

హైదరాబాద్: రాష్ట్రంలో ఆరోగ్య రంగానికి సంబంధించిన కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలపై ఎమ్మెల్యే హరీశ్ రావు ఘాటుగా స్పందించారు. అసెంబ్లీ వేదికగా తమ గళాన్ని వినిపించేం దుకు ప్రయత్నించినప్పటికీ, మైక్ ఇవ్వకపోవడంపై హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మైకులు కట్‌చేసి తాము చెప్పాలనుకున్న వాస్తవాలను సభ దృష్టికి తీసుకురాకుండా ప్రభుత్వం అడ్డుపడు తోందన్నారు. హరీశ్ రావు మాట్లాడుతూ.. 'ఆరోగ్యశ్రీ ఖర్చుల పెంపుపై ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోంది. 2014 జూన్ 2 నాటికి ఆరోగ్యశ్రీ కోసం నెలకు రూ.32 కోట్లు ఖర్చయ్యేవి. 2023 నాటికి ఇది రూ.68 కోట్లకు చేరుకుంది. కానీ.. ప్రభుత్వం రూ.89 కోట్లు ఖర్చు చేస్తున్నామని చెబుతోంది. జనాభా పెరుగుదల, వైద్య ఖర్చుల పెరుగుదల దృష్ట్యా ఈ పెంపు సహజం, ఇందులో కాంగ్రెస్ కొత్తగా సాధించిన ఘనతేమీ లేదు. కాంగ్రెస్ వచ్చిన తర్వాతే ఆరోగ్యశ్రీ ఖర్చులు బాగా పెరిగిపోయాయి. గత ప్రభుత్వ హయాంలో మంజూరు చేసి, పనులు చేపట్టిన ఆసుపత్రుల నిర్మాణానికి ప్రస్తుత ప్రభుత్వం జాప్యం చేస్తోంది. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చి ఉంటే ఆ ఆస్పత్రులన్నీ పూర్తై ప్రజలకు మెరుగైన సేవలు అందేవి. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేదలకు మరింత అండగా నిలవాలనే ఉద్దేశంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎక్సైజ్ అదాయంలో వాటాను పెంచి నిధులను సమకూర్చింది' అని అన్నారు.

# ఎపి కేబినేట్ కీలక నిర్ణయాలు

అమరావతి: రాజధాని అమరావతి అంశంపై ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసింది. రాష్ట్ర రాజధానిగా అమరావతిని కొనసాగిస్తూ, దానికి పూర్తిస్థాయిలో చట్టబద్ధత కల్పించేలా మంత్రివర్గం కీలక తీర్మానం చేసింది. గత కొంతకాలంగా సాగుతున్న న్యాయ, పరిపాలన పరమైన చిక్కులను తొలగించి, అమరావతి నిర్మాణ పనులను వేగవంతం చేసే దిశగా ఈ నిర్ణయం తీసుకున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ముగిసింది. ఈ భేటీలో రాష్ట్ర అభివృద్ధి, పాలనపరమైన అంశాలపై చర్చించి పలు కీలక నిర్ణయాలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఏపీ పునర్విభజన చట్టం 2014లోని సెక్షన్-5ను సవరించాల్సిందిగా మంత్రివర్గం తీర్మానం చేసింది. కొత్త రాజధాని స్థానంలో అమరావతి పేరును చేర్చాలని ప్రభుత్వం భావిస్తోంది. అంతేకాకుండా నీరుకొండలో ఎస్ఆర్ఎం వర్సిటీ, 60 మీటర్ల ఎత్తు వరకు అకడమిక్ భవనాల నిర్మాణానికి క్యాబినెట్ అనుమతి ఇచ్చింది. అలాగే రాష్ట్రంలో 96 జూనియర్, సీనియర్ సివిల్ జడ్జిల కోర్టుల ఏర్పాటుకు ఆమోదం ఇచ్చింది. వడ్డెర సంఘాలకు ప్రాధాన్యక్రమంలో ఖనిజ లీజుల కేటాయింపులపై చర్చించారు. ఖనిజ లీజుల కేటాయింపులో ప్రీమియం, సీనరేజ్ ఫీజుల్లో 50శాతం రాయితీ

ఇవ్వనున్నారు. కుప్పం బాలికల పాఠశాలలో పీఈటీ, నర్సు, రికార్డు అసిస్టెంట్ పోస్టుల మంజూరుకు ఆమోదం ఇచ్చింది.



2025-26 ఆర్థిక సంవత్సరానికి ఆస్తి పన్ను బకాయిలపై వడ్డీ మాఫీ చేసింది. జలవనరుల శాఖలో వివిధ ప్రాజెక్టుల ఆధునికీకరణ, మరమ్మతులకు పరిపాలన అనుమతులు ఇచ్చారు. వివిధ సంస్థలకు భూ కేటాయింపులపై రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకున్నది. ఎలక్ట్రిక్ ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని మంత్రి వర్గం నిర్ణయించింది. కొత్త రాజధానిగా సీఆర్డీఏ చట్టం పరిధిలోని అమరావతి పేరు చేర్చాలని క్యాబినెట్ తీర్మానించింది. 28న అసెంబ్లీలో 4 గంటలపాటు చర్చించి తీర్మానించాలని నిర్ణయించింది. రాజధాని చరిత్రను ప్రజలకు తెలియ జేయాలని సీఎం చంద్రబాబు క్యాబినెట్‌కు సూచించారు. క్యాబినెట్ సమావేశంలో భాగంగా విద్యుత్ వ్యవస్థపై ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఏప్రిల్ 5 నుంచి 14 లోపు ప్రతి నియోజకవర్గంలో 2 వేల చొప్పున సూర్యఘర్ కనెక్షన్లు ఇవ్వాలని నిర్ణయించారు. పీఎం కుసుమ్ ద్వారా పవర్ లాస్‌లు తగ్గించేలా చూడాలని దిశానిర్దేశర చేశారు. బ్యాటరీ స్టోరేజ్ వ్యవస్థల్ని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ల వద్ద ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సాంకేతికత అందిపుచ్చుకుంటూ సంస్కరణలు తీసుకొస్తూ విద్యుత్‌శాఖ ముందుకెళ్లాలని సూచించారు. ఆదాయంలో 99శాతం జీతాలకే సరిపోతోంది. కేంద్ర సాయం అప్పులు, వడ్డీలు కట్టేందుకే సరిపోతోంది. క్లిష్టపరిస్థితు ల్లోనూ సంక్షేమం అందిస్తూ అభివృద్ధి దిశగా నడిపిస్తున్నాం. కేంద్ర పథకాలను ఎక్కువగా మనం ఉపయోగించుకుంటున్నాం. ఈ పార్లమెంట్ భేటీలోనే రాజధానిగా అమరావతి చట్టబద్ధత సవరణ బిల్లు పెడతారు' అని సీఎం చంద్రబాబు అన్నారు.

# బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సతీష్ కుమార్ ఎన్నిక

**నల్గొండ, మన సాక్షి, మార్చ్ 26**

నల్లగొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఏ సతీష్ కుమార్ ఎన్నికయ్యారు. గురువారం నిర్వహించిన ఎన్నికల్లో ఆయన దర్శనం నరసింహపై 181ఓట్ల తో గెలుపొందారు. అదేవిధంగా ఉపాధ్యక్షులుగా పజ్జురుస్వామి గౌడ్, ఏ సంధ్యారాణి, ప్రధాన కార్యదర్శిగా బచ్చనబోయిన అశోక్ కుమార్, జాయింట్ సెక్రటరీగా సూర్య పెల్లి అమరావతి, కోశాధికారిగా ఎండి ఫిరోజ్, క్రీడా కార్యదర్శిగా నారా బోయిన ప్రసన్నకుమార్, లైబ్రరీ



సెక్రటరీగా పూల పోయిన రామకృష్ణ, లు ఎన్నికయ్యారు. వీరితోపాటు కార్యవర్గ సభ్యులుగా మిరియాల భాగ్యమ్మ, దువ్వ గీత, పులిజాల కార్తీక్, కే నగేష్ కుమార్, మేడి ప్రగతి, జై రాములు, పందుల సైదులు, జి వెంకట్ రెడ్డి లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికలకు ఎన్నికల అధికారిగా సయ్యద్ జమాల్, అసిస్టెంట్ ఎన్నికల అధికారులుగా బి రవి ఏ వెంకటరెడ్డి లు వ్యవహరించారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన సతీష్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల్లో తన గెలుపు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. న్యాయవాదుల సమస్యల పరిష్కారం కోసం తనవంతుగా కృషి చేస్తానన్నారు.

# గత ప్రభుత్వం బకాయిలు కడుతున్నాం

హైదరాబాద్:గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకానికి రూ.600 కోట్లు బకాయిలు పెట్టి వెళ్తే తాము ప్రతినెలా రూ.89 కోట్లు ఖర్చు పెడుతున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. ఇప్పటివరకు రూ.2,408 కోట్ల బిల్లులు చెల్లించామని అసెంబ్లీ సాక్షిగా తెలిపారు. ఏడో రోజైన గురువారం అసెంబ్లీ సమావేశాల సందర్భంగా సభలో సీఎం రేవంత్



ప్రసంగించారు. ఆరోగ్య శ్రీ కింద ప్రభుత్వాసు పత్రులకు రూ.927 కోట్లు, ప్రైవేట్ ఆస్పత్రులకు రూ.1,480 కోట్లు చెల్లించామని చెప్పుకొచ్చారు. 27 నెలల్లో పేదల వైద్యం కోసం రూ.4,500 కోట్లు చెల్లించామని ఆయన వివరించారు. పేదలకు అన్యాయం జరుగుతోందని విపక్షాలు అపోహలు సృష్టిస్తున్నాయని.. బీఆర్ఎస్ గత ప్రభుత్వంలో సీఎం రిలీఫ్ ఫండ్ ఎలా దుర్వినియోగం చేశారో అందరికీ తెలుసంటూ విమర్శించారు. ఎవరి పీఏలు సీఎం రిలీఫ్ ఫండ్ కాజేశారో కూడా తెలుసంటూ చురకలు అంటించారు. గత ప్రభుత్వంలో సీఎంఆర్ఎఫ్ నిధులను కొందరు తమ సొంత ఖాతాల్లో వేసుకున్నారని, దీనిపై విచారణ జరుగుతోందన్నారు. త్వరలోనే అన్నీ బయటకు వస్తాయని హెచ్చరించారు. తాము అధికారంలోకి వచ్చాక 27 నెలల్లో రూ.2,046 కోట్ల సీఎంఆర్ఎఫ్ కింద ఇచ్చామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం అప్పుల భారాన్ని తమకు వారసత్వంగా ఇచ్చిందని, ఆ బకాయిలను తామే చెల్లిస్తున్నామని రేవంత్ రెడ్డి చెప్పారు. బీఆర్ఎస్ గత ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కోసం నెలకు రూ.52 కోట్లు ఖర్చు చేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం నెలకి రూ.89 కోట్లు ఖర్చు చేస్తోందని తెలిపారు. ఆరోగ్య శ్రీ ఇవ్వకపోవడం వల్ల చికిత్స చేయట్లేదు అనేది అపోహ మాత్రమే అన్నారు. ఇన్ని ఇబ్బందుల్లో కూడా ఆరోగ్య శ్రీ పథకాన్ని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. విద్యా, వైద్యం విషయంలో కోతలు ఉండవని సీఎం రేవంత్ మరోసారి తేల్చి చెప్పారు. కోతలు పెట్టాల్సి వస్తే వేరే కోతలు పెడతామని అన్నారు. టీచింగ్ కాలేజీల నిర్వహణ గ్రూప్-1 అధికారులకు అప్పగిస్తామని, ప్రతి కుటుంబానికి జీవిత బీమా అందించేందుకు కొత్త పథకం తీసుకు వస్తున్నట్లు సీఎం రేవంత్ తెలిపారు.విద్య, పేదల వైద్యం తమ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యాంశాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. వైద్యానికి నిధులు కేటాయించి రాష్ట్రాన్ని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతామని చెప్పారు. తమ ప్రభుత్వ హయాంలో రూ.2,046 కోట్ల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశామని చెప్పారు. గతంలో ఈ చెక్కుల విషయంలో అవినీతి జరిగిందన్నారు. 27 నెలల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో పేదల వైద్యం కోసం రూ.4,500 కోట్లు చెల్లించామన్నారు. టీచింగ్ కాలేజీలకు రోగులు వెళ్లడం లేదని సీఎం అన్నారు. ఈ కాలేజీల నిర్వహణను గ్రూప్-1 అధికారులకు అప్పగిస్తామని చెప్పారు. ప్రతి కుటుంబానికి జీవిత బీమా అందించేందుకు కొత్త పథకం తీసుకొచ్చామని వివరించారు. విదేశాల్లో నిపుణులైన వైద్యుల సేవలను వినియోగించుకోవాలని ప్రభుత్వం ఆలోచిస్తోందన్నారు. గోషామహల్‌లో 30 ఎకరాల్లో రూ.3వేల కోట్లతో ఉస్మానియా ఆస్పత్రి నిర్మిస్తున్నామన్నారు.

# నేడు రాష్ట్రాల సిఎంలతో ప్రధాని వీడియో కాన్ఫరెన్స్

**పశ్చిమాసియా పరిస్థితులపై రాష్ట్రాలకు వివరించే ఛాన్స్**

న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం మరింత అప్రమత్తమయ్యింది. ఈ క్రమంలో అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రధాని మోదీ శుక్రవారం వర్చువల్‌గా సమావేశం కానున్నారు. శు క్రవారం సాయంత్రం 6.30గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వారితో మాట్లాడనున్న ఆయన.. పశ్చిమాసియాలో పరిస్థితులు, భారత్ అనుసరిస్తున్న విధానాలను వివరించనున్నట్లు సమాచారం. అదేవిధంగా ఆయా రాష్ట్రాల సన్నద్ధత, సహకారంపై చర్చించనున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. వచ్చే నెలలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల ముఖ్యమంత్రులు మాత్రం ఈ సమావేశానికి దూరంగా ఉండనున్నట్లు తెలిసింది. అయితే, ఆయా రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులతో కేబినెట్ సెక్రటరీ ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ప్రధాని-సీఎంల వీడియో కాన్ఫరెన్స్‌లో తీసుకున్న వివరాలను సీఎస్‌లకు వెల్లడించి.. ఆయా రాష్ట్రాల్లో అమలు చేసేలా కేబినెట్ సెక్రటరీ సూచించనున్నట్లు సమాచారం. ఇటీవల పార్లమెంటు ఉభయసభల్లో మాట్లాడిన ప్రధాని మోదీ.. యుద్ధం వల్ల ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న సంక్లిష్ట పరిస్థితులు దీర్ఘకాలం కొనసాగే అవకాశాలు ఉన్నాయన్నారు. ఇది పరీక్షా సమయమేనని తెలిపారు. సంక్షోభం నుంచి బయటపడటంలో రాష్ట్రాలన్నీ కేంద్రంతో కలిసి టీమ్ ఇండియాలా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు ప్రజలు సిద్ధమై ఉండాలని కోరారు. ఈ క్రమంలోనే అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సమావేశానికి సిద్ధమవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సమావేశంలో పశ్చిమాసియా యుద్ధం కారణంగా తలెత్తిన సంక్షోభంపై కీలక సూచనలు చేయనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం దేశంలో చమురు, గ్యాస్‌పై విపరీతంగా వదంతులు వ్యాపిస్తున్నాయి. మధ్యప్రాచ్యం యుద్ధం కొనసాగితే.. ఎదురయ్యే ఇబ్బందులను ఎలా ఎదుర్కోవాలన్న దానిపై మోడీ దిశానిర్దేశర చేయనున్నారు. గత నెల 28 నుంచి పశ్చిమాసియాలో యుద్ధం జరుగుతోంది. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడి చేశాయి. ఈ ఘటనలో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా లీ ఖమేనీ హతమయ్యాడు. దీంతో ఇరాన్ ప్రతీకార దాడులకు దిగింది. గల్ఫ్ దేశాల్లోని ఇంధన, గ్యాస్ క్షేత్రాలపై క్షిపణులతో విరుచుకుపడింది. అంతేకాకుండా హోర్ముజ్ జలసంధిని కూడా మూసేసింది. దీంతో ప్రపంచ దేశాల్లో చమురు, గ్యాస్ కష్టాలు తీవ్ర స్థాయికి చేరాయి. ఇప్పటికే ఆయా దేశాల్లో అత్యవసర పరిస్థితులు అమలు అవుతున్నాయి. అలాగే భారత్‌లో కూడా కరోనా కాలం నాటి లాక్‌డౌన్ పరిస్థితులు వస్తాయంటూ పుకార్లు వ్యాప్తి చెందుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రధాని మోడీ.. అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సమావేశం నిర్వహించడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

# ఏప్రిల్ 2నుంచి 5 మండలాల్లో ఇంటిగ్రేటెడ్ భూభారతి

హైదరాబాద్:తెలంగాణ భూపరిపాలనలో సరికొత్త శకం ఆరంభం కాబోతోందని గత ప్రభుత్వ హయాంలో ధరణి తెచ్చిన చిక్కుముడులను విప్పుతూ, రైతులకు అత్యంత పారదర్శకంగా, సులభతరమైన సేవలు అందించడమే లక్ష్యంగా కొత్తగా రూపొందించిన ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ ( ఇంటిగ్రేటెడ్ డిజిటల్ ల్యాండ్ రికార్డ్స్ మేనేజిమెంట్ సిస్టమ్) ను ఏప్రిల్ 2వ తేదీ నుంచి ఐదు మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. గురువారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో రెవెన్యూ, సర్వే, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ , ఎన్ఐసి అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారి ఆలోచన మేరకు తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా భూపరిపాలన సేవలను మరింత వేగవంతంగా అందించడానికి రెవెన్యూ. స్టాంప్స్/ రిజిస్ట్రేషన్ , సర్వే విభాగాలను ఒకే గొడుగు కిందకు తెస్తూ భూభారతి పోర్టల్‌ను అభివృద్ధి చేయడం జరిగిందని తెలిపారు. ప్రతి భూలావాదేవీ వివరాలు కనిపించేలా పారదర్శకంగా ఈ పోర్టల్‌ను రూపొందించినట్లు వెల్లడించారు. ఈ ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ ను నారాయణపేట జిల్లా కొస్గి, రంగారెడ్డి జిల్లా అమన్‌గల్, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి, ఖమ్మం జిల్లా కుసుమంచి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట మండలాల్లో వచ్చేనెల 2వ తేదీ నుంచి ప్రయోగాత్మకంగా అమలు చేస్తామని తెలిపారు. ఈ పైలట్ మండలాల్లో మెరిట్- డీమెరిట్ లను క్షుణ్ణంగా పరిశీలించి వాటికి అవసరమైన మార్పులు చేర్పులు చేసి రెండవ దశలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అమలు చేస్తామని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామని అలాగే ధరణి పోర్టల్‌ను బంగాళాఖాతంలో కలిపి భూభారతి పోర్టల్‌ను కూడా తీసుకురావడం జరిగిందన్నారు. భూభారతి చట్టంలో పేర్కొన్నవిధంగా వ్?వసాయ భూము లకు సంబంధించి క్రయ విక్రయదారులకు ఇబ్బంది లేకుండా రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాపును జతపరచే నిబంధనను ఈ ఐదు మండలాల్లో అమలు చేస్తున్నట్లు వెల్లడించారు.తద్వారా రాష్ట్రంలో భూవివాదాలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ ఐదు మండలాల్లో ప్రతి సర్వే నెంబరుకు ఆధార్ నెంబర్ మాదిరిగానే భూధార్ నెంబర్‌ను కూడా ఇస్తామని తెలిపారు

# ట్యాక్సీ డ్రైవర్లు ప్రయాణికులను సురక్షితంగా గమ్యానికి చేర్చాలి

**సూర్యాపేట మార్చి 26 మనసాక్షి**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక, అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత కార్యక్రమంలో భాగంగా ఈరోజు సూర్యాపేట పట్టణ సూర్యాపేట ట్రాఫిక్ పోలీసులు ఆధ్వర్యంలో పట్టణంలోని న్యూ బస్టాండ్ ఆటో స్టాండ్ వద్ద ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రతా నియమాల పట్ల, ప్రయాణికుల అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో




పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య మాట్లాడుతూ ప్రయాణికులను సురక్షితంగా గమనించడం టాక్సీ డ్రైవర్ల బాధ్యత అని తెలిపారు. వాహనాలు నడిపే సమయంలో నిదానంగా నడపాలని, పరిమితికి మించి ప్రయాణికులను వాహనాల్లో ఎక్కించవద్దు అని తెలిపినారు. వాహనాలలో ప్రయాణికులు ఏవైనా వస్తువులు మర్చిపోతే బాధ్యతగా వారికి అందజేయాలని లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని. ప్రయాణికులతో మర్యాదగా ఉండాలని సూచించారు. రోడ్డు భద్రత పట్ల ఎదుటివారికి అవగాహన కల్పించడంలో బాధ్యతగా ఉండాలని కోరారు. ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం మాట్లాడుతూ జాగ్రత్తగా వాహనాలు నడుపుతూ సురక్షితంగా గమనించాలి సూచించారు. నియమ నిబంధనలు పాటించినట్లయితే కేసులు నమోదయితాయని హెచ్చరించారు.

# చిన్నారులకు నాణ్యమైన విద్య.. పోషకాహారం

హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య, పోషకాహారం అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి తో ప్రముఖ ఆర్థికవేత్త కార్తీక్ మురళీధరన్ గురువారం భేటీ అయ్యారు. రాష్ట్ర శాసనమండలి హాల్‌లో గురువారం జరిగిన సమావేశంలో పలు అంశాలపై వారు చర్చించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో 0-10 ఏళ్లలోపు పిల్లల్లో పోషకాహారం లోపం.. విద్యాభ్యాసన స్థాయి సామర్థ్యలోపాలకు సంబంధించి పలు నివేదికలను కార్తీక్ మురళీధరన్ సీఎం దృష్టిక తీసుకువచ్చారు. చిన్న వయస్సులో పోషకాహారం లోపంతో భవిష్యత్‌లో తలెత్తే ఆరోగ్య సమస్యలు.. ప్రాథమిక స్థాయిలో సరైన బోధన లభించకపోతే విద్యార్థి భావి జీవితంలో పడే మానసిక వేదనను ఆయన తెలియజేశారు. వాటిని అధిగమించడానికి తీసుకోవాల్సిన అంశాలను ఆయన సీఎంకు సూచించారు. ఆయా అంశాలపై తాము

ఇప్పటికే ప్రత్యేక శ్రద్ధ పెట్టామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంతో పాటు అల్పాహారం పెట్టేందుకు బ్జడెట్ లో కేటాయింపులు చేసినట్లు వివరించారు. అంగన్‌వాడీల్లో కార్యకర్తలు, ఆయాలతో పాటు పోషకాహారం అందజేసేందుకు అదనంగా మరొకరిని నియమించాలని కార్తీక్ మురళీధరన్ సూచించారు. అంగన్‌వాడీల్లో పిల్లలకు పోషకాహారం అందజేసేందుకు పోషణ సఖి పేరుతో మరొకరిని నియమించేందుకు అవకాశం ఉందని అధికారులు తెలియజేశారు. కార్తీక్ మురళీధరన్ సూచించే అంశాలను కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్) పరిధిలోని 29 స్కూల్ కాంప్లెక్స్‌ల పరిధిలో ప్రయోగాత్మకంగా అమలు చేసేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని సీఎం అధికారులకు సూచించారు. కార్తీక్ మురళీధరన్‌తో సమన్వయం చేసుకొని ఈ అంశంపై ప్రత్యేక నివేదిక రూపొందించి సమర్పించాలని సీఎం అధికారులను ఆదేశించారు.

# పరిపాలనలో రెవెన్యూ వ్యవస్థ అత్యంత కీలకం

## జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్.




**నారాయణపేట టౌన్, మార్చి 26 మనసాక్షి :-**

జిల్లా పరిపాలన లో రెవెన్యూ వ్యవస్థ అత్యంత కీలకమని, రెవెన్యూ అధికారులు పారదర్శకంగా పని చేసి ప్రజలకు సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. గురువారం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్లతో ఆయన రెవెన్యూ శాఖపై తొలి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో భూ భారతి పెండింగ్ దరఖాస్తులను వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజా వాణి కార్యక్రమంలో ఎక్కువ శాతం భూ సమస్యలపైనే ఫిర్యాదులు వస్తున్నాయని, వాటిని మండల స్థాయిలోనే పరిష్కరిస్తే కలెక్టరేట్ కు వచ్చే పరిస్థితి ఉండదన్నారు. అలాగే సాదా బైనామా దరఖాస్తులను జీ ఓ 76, 77 ప్రకారం నిబంధనల మేరకు పరిష్కరించాలని ఆయన తెలిపారు.

జిల్లాలో అనుమతి లేకుండా అక్రమంగా తరలించే ఇసుక వాహనాలను పట్టుకుని సీజ్ చేసి తన , రెవెన్యూ అదనపు కలెక్టర్ అనుమతి లేకుండా సీజ్ చేసిన ఇసుక వాహనాలను వదల వద్దని తేల్చి చెప్పారు. ఇసుక అక్రమ రవాణా పై ప్రభుత్వం చాలా సీరియస్ గా ఉందని చెప్పారు. జిల్లాలో ప్రభుత్వ స్థలాలను సంరక్షించాలని, సోలార్ పవర్ ప్లాంట్లకు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి ప్రభుత్వ స్థలాన్ని గుర్తించాలని కలెక్టర్ సూచించారు. సమాచార హక్కు చట్టం కింద వచ్చిన దరఖాస్తులకు 30 రోజుల్లోపు సమాధానం ఇవ్వాలన్నారు. దరఖాస్తుదారులు అడిగిన వాటికి స్పష్టమైన సమాచారం ఇవ్వాలని, అప్పీలుకు వెళ్ళే ఆస్కారం ఇవ్వొద్దన్నారు.

పెండింగ్ లో ఉన్న కల్యాణ లక్ష్మి/ షాదీ ముబారక్ పథకాల దరఖాస్తులను వెంటనే క్లియర్ చేయాలన్నారు. కుల ధ్రువీకరణ పత్రాల జారీ విషయంలో ఆలస్యం వద్దన్నారు. వీటితో పాటు లోకాయుక్త , బైండ్ ఓవర్ కేసుల పట్ల నిర్లక్ష్యం చేయొద్దని ఆయన తెలిపారు. ఏప్రిల్ లో ఎస్. ఐ.ఆర్ ప్రారంభమవుతుందని, అంతలోపు రెవెన్యూ శాఖలో పెండింగ్ లో ఉన్న పనులన్నీ క్లియర్ చేసుకుంటే ఎస్. ఐ.ఆర్ ప్రారంభమైన తర్వాత ఒత్తిడి ఉండదన్నారు. రెవెన్యూ వ్యవస్థ పై ప్రజల్లో పూర్తి నమ్మకం కలిగేలా విధులు నిర్వహించాలని తహసీల్దార్లకు కలెక్టర్ హితవు పలికారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, ఆర్డీవో రామచందర్ నాయక్, కలెక్టరేట్ ఏవో శ్రీధర్, సీ సెక్షన్ అధికారినిలు జయసుధ,అఖిల ప్రసన్న, జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

# శక్తి పీఠంలో ఘనంగా శ్రీ సీతారాముల కళ్యాణం

**నారాయణపేట టౌన్ మార్చి 26 మనసాక్షి :-**





నారాయణపేట జిల్లా కేంద్రంలోని శక్తి పీఠం ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం 6:30 నిలకు శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇట్టి కార్యక్రమం శ్రీ సీతారాముల దివ్య కళ్యాణంతో ప్రారంభమై, భక్తులకు కనుల పండుగగా నిలిచింది. కార్యక్రమంలో భాగంగా శక్తి పీఠం వ్యవస్థాపకులు పూజ్యశ్రీ డా. స్వామి శాంతానంద్ పురోహిత్ ఆధ్యాత్మిక ప్రవచనం అందిస్తూ, శ్రీ సీతారాముల దైవిక కథలు మరియు వాటి లోని ఆధ్యాత్మిక సందేశాలను భక్తులకు వివరిస్తూ అందరికి ఆశీర్వాదలను అందజేసారు. కార్యక్రమంలో భాగంగా ప్రముఖ సంగీత విద్వాంసులు శ్రీ రాయచూరు శేషగిరిదాస్ చే సంగీత విభావరి కార్యక్రమం నిర్వహించారు. తెలుగు సినీ ఢ సీరియల్ నటి రాశి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ నారాయణపేట శక్తి పీఠానికి రావడం, శ్రీ సీతారాముల కళ్యాణాన్ని ప్రత్యక్షంగా వీక్షించడం తమ అదృష్టంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ఇంత వైభవంగా నిర్వహించడం చూసి ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు.శక్తి పీఠం లోని శ్రీ సీతారాముల కల్యాణన్ని వీక్షించి స్వాముల వారిని దర్శించుకోవడం పూర్వజన్మ సుకృతం అని తెలిపారు. కార్యక్రమం అనంతరం విచ్చేసిన భక్తులందరికీ అన్నప్రసాదం నిర్వహించారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



**వెల్దండ మార్చి 26 మన సాక్షి:**

వెల్దండ మండలంలోని చెర్కూర్ గ్రామంలో హైదరాబాద్ – శ్రీశైలం ప్రధాన జాతీయ రహదారిపై ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో దొడ్ల రమేష్ మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో గురువారం చెరుకూరు గ్రామ విజయ డైరీ అధ్యక్షులు బాలయ్య ఆధ్వర్యంలో మృతుని కుటుంబానికి రూ. 15 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. బాధిత కుటుంబానికి విజయ డైరీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు మహమ్మద్ అలీ, పాల్గొన్నారు.

## ఉచితంగా కూరగాయ విత్తనాల పంపిణీ



**నారాయణపేట టౌన్, మార్చి 26 మనసాక్షి :-**

నారాయణపేట ఉద్యాన శాఖ కార్యాలయంలో రైతులకు గురువారం జిల్లా ఉద్యాన అధికారి డాక్టర్ సాయిబాబా ఆధ్వర్యంలో ఉచిత కూరగాయల విత్త నాలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమం ద్వారా వేల కుటుంబాలకు కూరగాయల సాగు ప్రోత్సహించడానికి మిని కిడ్స్ ఇస్తున్నా మన్నారు. దామరిగిద్ద మండలం సజానాపురం గ్రామానికి చెందిన రైతులు మహిళలకు కూరగాయ విత్తనాలు పంపిణీ చేశారు. ప్రతిరోజు ఆహారానికి సారవంతమైన కూరగా యలు పండించి తమ కుటుంబానికి ఇతరులకు తామే ఇవ్వాలని ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నదనీ విషయాన్ని సహకార సంఘం అధ్యక్షుడు లక్ష్మీకాంత్ అన్నారు. ఈ కార్యక్రమంలో జనార్ధన్, కాట్రే రాములు రైతులు పాల్గొన్నారు.

## ఉచిత గాలికుంటు టీకాలు




**వెల్దండ మార్చి 26 మన సాక్షి:**

ఉచిత గాలికుంటు వ్యాది నివారణ టీకాలను పాడి రైతులు సద్వినియోగపరుచుకోవాలని వైద్యాధికారి డాక్టర్ రాజేష్ అన్నారు. రాగాయపల్లి గ్రామ పరిధిలోని నాగరావుపల్లి తండాలో గురువారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు మాజీ సింగల్ విండో డైరెక్టర్ నాగులు నాయక్, వార్డు సభ్యులు లక్ష్మణ్ నాయక్ ఆధ్వర్యంలో 146 పశువులకు టీకాలు వేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నరేష్ రెడ్డి, వైద్య సిబ్బంది తిరుపతయ్య, గోపాల మిత్రలు బాలు, విజేందర్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులుగా, లింగారెడ్డి లక్ష్మీనరసయ్య,

**ధర్మారం, మార్చి,26, మన సాక్షి,**



ధర్మారం మండలంలోని నందిమేడారం జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయవాదుల అసోసియేషన్, ఎన్నికలను గురువారం కోర్టు ఆవరణలో నిర్వహించడం జరిగింది. బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా గడ్డం లింగా రెడ్డి, ఉపాధ్యక్షులు గా ఈదుల ప్రదీప్ రెడ్డి, జనరల్ సెక్రటరీ గా బొట్ల లక్ష్మీనర్సయ్య, జాయింట్ సెక్రటరీ గా ఆకారి రాజేశం, కోశాధికారి గా నూనే సత్యనారాయణ, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ గా భీమారపు సంపత్, పాటు తదితరులు ఎన్నికవడం జరిగింది. ఈ కార్యక్రమంలో న్యాయవాదుల కార్యవర్గానికి పలువురు నాయకులు మరియు బిజెపి నాయకులు దేవి రాజలింగు, శుభాకాంక్షలు తెలిపారు.

## మల్లూరు ఆలయ అభివృద్ధిపై మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలి

**మంగపేట, మార్చి 27 మన సాక్షి**



మల్లూరు శ్రీహేమాచల లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధిపై మాస్టర్ ప్లాన్ వెంటనే సిద్ధం చేయాలని, స్వామి వారి దర్శనం కోసం వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం మంగపేట మండలం మల్లూరు శ్రీహేమాచల లక్ష్మీ నరసింహ స్వామి ఆలయాన్ని జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ సందర్శించి అభివృద్ధి ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవస్థానానికి దర్శనం కోసం అనేకమంది భక్తులు వస్తుంటారని, వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని రకాల వసతులు సౌలభ్యాలు ఆలయ అభివృద్ధి పై వెంటనే మాస్టర్ ప్లాన్ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ప్రధాన ఆర్చి నిర్మాణం, రోడ్డు విస్తరణ, కళ్యాణ కట్ట, కళ్యాణ మండపం, పార్కింగ్ స్థలాల ఏర్పాటు, ఇతర ఆలయ అభివృద్ధి పనులపై త్వరితగతిన నివేదికలు రూపొందించాలని పేర్కొన్నారు. ఆచారసాంప్రదాయాలకు ఆటంకం కలగకుండా ఆలయ అభివృద్ధి చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ ఆర్కిటెక్ బృందం, దేవాదాయ శాఖ డి ఈ రమేష్ బాబు, తాసిల్దార్ తోట రవీందర్, ఆలయ ఈవో మహేష్, ఎంపీడీవో బద్రు నాయక్, ఆలయ అర్చకులు, సంబంధిత అధికారులు, దేవస్థానం మాజీ చైర్మన్లు సురేష్. సమ్మయ్య, స్థానిక గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## డిప్యూటీ తాహసీల్దార్ వినతి

**వెల్దండ మార్చి 26 మన సాక్షి:**



వెల్దండ మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో బొడ్రాయి పండుగ పేరుతో మాదిగ కులాన్ని తీవ్రంగా అవమానించి, బహిష్కరించే కుట్రలు చేస్తున్న వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గురువారం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసిల్దార్ మహమ్మద్ అలీకి వినతి పత్రం అందజేశారు. అంతకుముందు స్థానిక పోలీస్ స్టేషన్ లో ఎస్సై కురుమూర్తికి ఫిర్యాదు అందజేశారు. అదే గ్రామానికి చెందిన కాయితి యాదవ రెడ్డి, పబ్బు చక్రవర్తి గౌడ్, చిన్నోజు ప్రసాద్ చారి, దెంది సుధాకర్ రెడ్డి, దెంది రాంరెడ్డి అనే వ్యక్తులు మాదిగలు బొడ్రాయి పండుగలో పాల్గొనద్దని కుట్రలు చేస్తున్నారని, శాంతి భద్రతలకు భంగం కలిగిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మాదిగల దేవాలయాల నిర్మాణం కొరకు ఆరు నెలలు గడువు కావాలని, ఆ తర్వాత బొడ్రాయి పండుగను నిర్వహించాలని కోరినప్పటికీ.. మా నిర్ణయాన్ని పరిగణలోకి తీసుకోకుండా, ఏకపక్ష నిర్ణయాలతో మాదిగలను అవమానపరిచి, బహిష్కరించే విధంగా కుట్రలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలనీ లేనిపక్షంలో దళిత సంఘాలను కలుపుకొని రాష్ట్రస్థాయిలో ఉద్యమిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మాదిగ నాయకులు తక్కల్లపల్లి శేఖర్, జగన్, కొప్పు వెంకటేష్, తక్కల్లపల్లి మహేష్, కాటిక శివకుమార్, తక్కల్లపల్లి అరుణ్ కుమార్, కొప్పు పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నీటి కొరత లేకుండా చూడాలి

**గోదావరిఖని మార్చి 26 మన సాక్షి**



వేసవిలో నీటి కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టడానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని రామ గుండం నగర మేయర్ మహంకాళి స్వామి ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు నగర పాలక సంస్థ కార్యాలయంలో ఇంజనీరింగ్ అధికారులతో గురువారం సమీక్షా సమావేశం, నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని వేసవి కాలంలో నీటి ఎద్దడితో ప్రజలు ఇబ్బందులు పడకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడానికి సిద్ధంగా ఉండాలని కోరారు. వేసవి కార్యాచరణ ప్రణాళిక అమలు చేయడానికి నిధుల మంజూరుకై అంచనాలు తయారు చేసి సకాలంలో ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించాలని అన్నారు. ఇటీవలి కౌన్సిల్ సమావేశంలో కార్పొరేటర్లు దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను ప్రథమ ప్రాధాన్యతగా పరిష్కరించాలని అన్నారు. వీధి దీపాల నిర్వహణకు సంబంధించి ఎనర్జీ సేవింగ్ పై దృష్టి సారించాలని అన్నారు. వాహన మరమ్మత్తులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టి శానిటేషన్ సమస్యలను సత్వరమే పరిష్కరించే ప్రయత్నం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ ఎస్.ఇ. గురువీర, ఇ ఇ . పి.వి. రామన్, డి.ఇ లు ఆఫ్తాబ్, శాంతి స్వరూప్, జగదీష్, షాబాజ్, ఎ. ఇ లు జమీల్, తేజస్విని,మీర్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామ నవమి సందర్భంగా బందోబస్త్

**గోదావరిఖని మార్చి 26 మన సాక్షి**



శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని గోదావరిఖని శ్రీకోదండ రామాలయం లో సీత రాము ల కళ్యాణం కోసం బందోబస్త్ కోసం ఏర్పాటు చేసిన భద్రతా చర్యలను గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్ స్వయంగా పరిశీలించారు. పండుగ సందర్భంగా భక్తుల భారీ రద్దీ ఉండే అవకాశం ఉన్నందున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన బందోబస్త్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ, ఆలయ పరిసరాల్లో పోలీసు సిబ్బందిని నియమించి బ్యారికేడ్లు ఏర్పాటు చేసి, క్యూలైన్ల ద్వారా భక్తులను సజావుగా పంపించేలా చర్యలు చేపట్టామని చెప్పారు. భక్తుల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. ఎలాంటి అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.పండుగ వేళ శాంతి భద్రతలు కాపాడటంలో ప్రజలు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి రామగుండం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేశ్వరరావు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి 5 లక్షల చెక్కు అందజేత



**నారాయణపేట టౌన్, మార్చి 26 మనసాక్షి :-**

మరికల్ మండలం అప్పంపల్లి గ్రామానికి చెందిన అనంతమ్మ మరణించింది. గురువారం నారాయణపేట జిల్లా విద్యుత్ మృతురాలి భర్త కు 5 లక్షల రూపాయల చెక్కును అందజేశారు. గత రెండు సంవత్సరాల క్రితం భారీ వర్షం కారణంగా ఇంట్లో బట్టలు ఇస్త్రీ చేస్తున్న సమయంలో ఇల్లంతా షాకై మరణించింది. ఇట్టి విషయాన్ని విద్యుత్ అధికారులకు నష్టపరిహారం అందించాలని భారతీయ కిసాన్ సంఘ నాయకులు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వపరంగా విద్యుత్ శాఖ ద్వారా గురువారం వారి భర్త బాల్ రెడ్డికు 5 లక్షల రూపాయల చెక్కును జిల్లా విద్యుత్ అధికారి నవీన్ కుమార్, ఏఈ ప్రదీప్ కుమార్, మరియు మొగులప్ప ద్వారా భారతీయ కిసాన్ సాంగ్ రాష్ట్ర జోనల్ కమిటీ సభ్యులు వెంకోబా జిల్లా కార్యదర్శి అనంతరెడ్డి సమక్షంలో అందజేశారు. సహకరించిన కిసాన్ సంగ్ నాయకులకు మృతు రాలి భర్త బాల్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భారతీయ కిసాన్ సాంగ్ నాయకులు ఆకుల వెంకటప్ప, శాసముల బాలప్ప, మహిపాల్ రెడ్డి, తంగు విశ్వనాథ్, కురువ భూషణప్ప, జట్రం రాజు, పీకే ఆంజనేయులు, నరసింహారెడ్డి, ఇమామ్ తదితరులు పాల్గొనారు.

# అభివృద్ది పనులకు ఆమోదం

**అందోలు, మార్చి 27, మన సాక్షి:**



జోగిపేట పట్టణంలో ని అంబేద్కర్ విగ్రహాన్ని రోడ్డుపై పెట్టడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, అనువైన చోట పెట్టి గార్డెన్, ఫౌంటెన్ ను ఏర్పాటు చేద్దామని అందోలు--జోగిపేట మున్సిపల్ కౌన్సిల్ లో చర్చించారు. అందోలు--జోగిపేట మున్సిపాలిటీ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం చైర్మన్ కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగింది. మున్సిపాలిటీ పరిధిలో మిషన్ భగీరథ కింద కొత్త కనెక్షన్‌లు ఇచ్చేందుకు ఎలాంటి అభ్యంతరం లేదని, కనెక్షన్‌కు డిపాజిట్ ఎంత పెట్టాలన్న విషయమై సమావేశంలో తర్జన భర్జన నడిచింది. కనెక్షన్ లు ఇవ్వాలని మెజార్టీ సభ్యులు ఇందుకు ఆమోదం తెలిపారు. పట్టణంలోని 15వ వార్డులో చాలా మందికి మిషన్ భగీరథ కనెక్షన్‌లు అవసరం ఉన్నాయని వార్డు కౌన్సిలర్ శివశేఖర్ కౌన్సిల్ సమావేశం దృష్టికి తీసుకురావడంతో మున్సిపల్ చైర్మన్, సభ్యులు పై విధంగా చర్యలు తీసుకోవాలని తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేసారు. గురువారం అందోలు--జోగిపేట మున్సిపాలిటీ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం చైర్మన్ కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగింది.వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని వార్డుల్లో నీటి సమస్యలు తలేత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు చైర్మన్ తెలిపారు. మున్సిపల్ అధికారులు 23 అంశాలతో కూడిన ఎజెండా అంశాలపై చర్చించారు. మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని, పాత బోర్లలో ఫ్లషింగ్ చేయించాలని, క్లాక్ టవర్ నుంచి రాజరాజేశ్వరీ దేవాలయం వరకు సీసీ రోడ్డును వేయాలని 12వ వార్డు కౌన్సిలర్ కే. సరస్వతి చైర్మన్‌ను కోరారు. ఈ నెల 30వ తేదిన తైబజార్ వేలంపాటను నిర్వహించనున్నట్లు చైర్మన్ తెలిపారు. మున్సిపల్ పరిధిలో రూ.6 లక్షలతో వీధిలైట్లను కొనుగోలు చేయాలని కమిషనర్ రవీందర్ సూచించారు. 99 రోజులపాటు నిర్వహించే ప్రజాపాలన నిర్వహణ ఖర్చు కోసం వెచ్చించిన రూ.2 లక్షల రూపాయల ఆమోదంపై సభ్యులు అభ్యంతరం తెల్పడంతో వాయిదా వేసారు. ఆయా వార్డుల్లోని వివిధ అభివృద్ధి పనులను చేపట్టేందుకు గాను రూ.1.06 కోట్లను ఆమోదం తెలిపారు. మంచినీటి సమస్య పరిష్కారానికిగాను మంజూరైన రూ.64 లక్షలతో వార్డుకు 2,3 బోర్లు వేయించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు సభ్యుల ఆమోదంతో చైర్మన్ తెలిపారు.

అంబేద్కర్ విగ్రహం రోడ్డులో ఏర్పాటుతో ప్రమాదాలు

జోగిపేట పట్టణంలోని అంబేద్కర్ విగ్రహన్ని నడిరోడ్డుపై ఏర్పాటు చేయడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని ఆ విగ్రహాన్ని అనువైన చోట ఏర్పాటు చేసి వాటర్ ఫౌంటేన్, గార్డెన్‌ను ఏర్పాటు చేయాలన్న విషయమై కౌన్సిల్‌లో చైర్మన్, సభ్యులు చర్చించారు. ఇప్పటి వరకు చాలా ప్రమాదాలు జరిగాయని, ప్రాణ నష్టం జరగకముందే చర్యలు తీసుకుంటే మంచిదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసారు. దళిత సంఘాలతో చర్చించి నిర్ణయం తీసుకోవాలని పలువురు సభ్యులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ కార్యక్రమంలో కమిషనర్ రవీందర్, వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ (చిట్టిబాబు), కౌన్సిలర్‌లు పి.శివశేఖర్, తొట్ల రామకృష్ణ, ఆర్.నాగరత్నంగౌడ్, పి.శ్రీనివాస్, రాజశేఖర్, అరుణ్, హెచ్. శోభారాణి, కే.సరస్వతి,పిట్ల భాగ్యలక్ష్మి, ఆర్.జ్యోతి, శశికళ, కే.మాధవి, పి.కల్పన, మేఘనతో పాటు అధికారులు పాల్గొన్నారు.

# ఆర్టిజన్ కార్మికులను పర్మినెంట్ చేయాలి.

**నారాయణపేట టౌన్, మార్చి 26 మనసాక్షి :-**



రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులను ప్రభుత్వం వారి విద్యా అర్హతను బట్టి ఏ.పీ.ఈ.ఎస్.బి. రూల్స్ వర్తింపజేయాలని టి.వి.ఏ.ఈ. జె.ఏ.సి. పిలుపు మేరకు గురువారం స్థానిక డివిజన్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో నారాయణపేట జిల్లా నలుమూలల నుండి విద్యుత్తు శాఖ ఆర్టిజన్ కార్మికులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా కన్వీనర్ దిల్దార్ మాట్లాడుతూ గత 10 నుండి 15 ఏళ్లుగా ఈ శాఖ ని నమ్ముకుని ఆర్టిజన్ కార్మికులు 300 రూపాయల నుండి పనిచేస్తున్నారని,వారికి గత ప్రభుత్వం తమను ప్రభుత్వ శాఖలో విలీనం చేస్తున్నట్లు ప్రకటించింది.

కానీ వారికి కొన్ని ప్రత్యేకమైన రూల్స్ వదిలించటంతో శాశ్వత ఉద్యోగులతో సమానంగా జీతభత్యాలు అందడం లేదని కార్మికులు వాపోతున్నారు. శాశ్వత ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్నప్పటికి కొన్ని రూల్స్ తమకు వర్తించడం లేదని ఆర్టిజన్ కార్మికులు ఆవేదన వెలిబుచ్చారు. పదివేల నుండి శాశ్వత ఉద్యోగులుగా ప్రభుత్వం నుంచి ప్రకటించిన వారికి ప్రమోషన్లు లేక , పనికి తగ్గ వేతనం అందుక, పిఆర్సి లో కూడా తమకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, దీంతోపాటు మరి కొన్ని డిమాండ్ లతో ఈ నెల 30 న మరో ధర్నా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఏప్రిల్ రెండు న స్థానిక సర్కిల్ కార్యాలయం ముందు వంటా వార్పు కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

**ధర్నా కు 1104 మద్దతు ::**

ఆర్టిజన్ కార్మికులు డివిజన్ కార్యాలయం ముందు గురువారం నిర్వహించిన ధర్నాకు 1104 యూనియన్ డివిజన్ ప్రెసిడెంట్, సర్కిల్ కార్యదర్శి మొగలప్ప తమ మద్దతును ప్రకటించారు. ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ విద్యా ఆరాధన బట్టి ఆర్టిజన్ కార్మికులకు పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే ఏ.పి.ఈ.ఎస్.బి. రూల్స్ వర్తింపజేయాలని 110 తరఫున డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారాయణపేట జిల్లా నుండి ప్రాతినిధ్యం వహిస్తున్నందున విద్యుత్ కార్మికుల కష్టాలు తెలిసిన ముఖ్యమంత్రి వారి కష్టాలను తొలగిస్తారని ఆశాభవం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో 1104 నాయకులు రవీంద్ర చారీ, నూనె.రఘు , యాసిన్ పాషా , ఆర్టిజన్ కార్మికులు లక్ష్మీకాంత్ , జె. వెంకటేష్, తిరుపతి రెడ్డి, బాలరాజ్, వినోద్, చౌడప్ప, అంజలీ, దిల్దార్, నర్సింలు, శశికాంత్, తదితరులు పాల్గొన్నారు.

## సిసి రోడ్ నిర్మాణం



**వెల్దండ మార్చి 26 మన సాక్షి:**

వెల్దండ మండల పరిధిలోని సిలోని భావి తండా గ్రామపంచాయతీలో పోచమ్మ తండాలో గ్రామ సర్పంచ్ లక్ష్మీపతి నాయక్ అంతర్గత రహదారుల నిర్మాణానికి భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మనీలా సంజీవ్ కుమార్ యాదవ్ సహకారంతో గ్రామంలో నెలకొన్న మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రియాంక రవి, యువ నాయకులు రాము నాయక్, లక్ష్మణ్ నాయక్, శంకర్ నాయక్, మంగ్య, అజిత్ నాయక్, మహేష్ నాయక్, భీమ్ సింగ్ నాయక్, రమేష్ నాయక్, అరవింద్, తుకారం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి.

**నారాయణపేట టౌన్, మార్చి 26 మనసాక్షి :-**



నారాయణపేట సర్కిల్ (నారాయణపేట టౌన్, రూరల్, దామరగిద్ద) పరిధిలో చాలా కాలంగా కోర్టులో పెండిగ్‌లో వున్న కేసుల పరిష్కారం కోసం కక్షిదారులు జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని నారాయణపేట సీఐ శివశంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28న జాతీయ న్యాయ సేవాధికార సంస్థ అధ్వర్యంలో నారాయణపేట కోర్టు, కోస్గి కోర్టు ప్రాంగణాల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ లోక్ అదాలత్ ద్వారా చట్టరీత్యా రాజీకి అర్హమైన క్రిమినల్ కేసులతో పాటు రాజీపడదగిన సివిల్ కేసులు, భూ వివాదాలు, వాహన ప్రమాద పరిహార కేసులు, చిట్‌ఫండ్ కేసులు, చెక్‌బౌన్స్‌కేసులు, వైవాహిక కేసులు, తగాదాలు, అన్ని రకాల ట్రాఫిక్ కేసులకు సంబంధించి జాతీయ లోక్ అదాలత్‌నందు ఇరువర్గాల కక్షీదారులు అంగీకారంతో సత్వర పరిష్కారం ఈ లోక్ అదాలత్ ద్వారా పొందవచ్చని అన్నారు. ఇరువర్గాల కక్షిదారులు లోక్ అదాలత్‌ను సద్వినియోగించుకోని సమస్యలను పరిష్కరించుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలను లోకల్ పోలీస్ స్టేషన్ అధికారులను సంప్రదించాల్సిందిగా సిఐ తెలిపారు.

## చిన్న చిన్న తగాదాలు గ్రామంలోనే పరిష్కరించు కోవాలి

**నారాయణపేట టౌన్, మార్చి 26 మనసాక్షి :-**



నారాయణపేట జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం బోయినపల్లి గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ విజ్ఞాన సదస్సుకు చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కే. లక్ష్మీపతి గౌడ్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ కే. సురేష్ హాజరయ్యారు. గ్రామస్తులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ న్యాయ వ్యవస్థలో రాజ్యాంగం ప్రకారం అందరికి సమాన హక్కులు కల్పించడం జరిగిందని పేర్కొన్నారు. కోర్టులలో ఎక్కువ కేసులు భూమికి సంబంధించి ఉంటాయని వీటి వల్లనే చిన్న చిన్న తగాదాల వాళ్ళ క్రిమినల్ కేసులు నమోదవుతుంటాయని, చిన్న చిన్న తగాదాలను గ్రామంలోని పెద్ద మనుష్యుల ద్వారా పరిష్కరించుకోవాలని తెలిపారు. ఇప్పుడు అనగా ఈనెల 28న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నారని, అందులో రాజీపడదగ్గ క్రిమినల్ కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవాలని కోరారు. మహిళలపై లైంగిక వేధింపుల (నివారణ, నిషేధం, సంస్కరణ) చట్టం ఉందని, ప్రతి మహిళ అక్షరాస్యత, చట్టపరమైన అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. సమాజంలోని బలహీన వర్గాలకు హక్కులు, బాల్యవివాహాలు, బాలకార్మిక చట్టాలు, పోక్సో ఆక్ట్ గురించి తెలిపారు. ఆడ పిల్లలకు చిన్న వయస్సులో వివాహాలు చేయడం నేరమని తెలిపారు. న్యాయపరమైన రక్షణ, చట్టపరమైన అవగాహన, ఉచిత న్యాయ సహాయం ఎలా పొందాలి అనే విషయాలను జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ద్యారా పేదవారు 15100 నెంబర్ కి కాల్ చేసినచో ఉచిత న్యాయాన్ని పొందవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి లక్ష్మి దేవి, ఉప సర్పంచు హన్మంతు, పోలీస్ కానిస్టేబుళ్లు రాజా, నరసింహ గౌడ్, గ్రామ ప్రజలు, వార్డు మెంబెర్స్, పాల్గొన్నారు.

## సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ



**వెల్దండ మార్చి 26 మన సాక్షి:**

వెల్దండ మండల కేంద్రంలో స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో నాలుగో వార్డులో సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ గురువారం అంతర్గత రహదారుల నిర్మాణానికి సర్పంచ్ భూమి పూజ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బస్నమోని శ్రీను ముదిరాజ్, కూన సావిత్రమ్మ, కార్యదర్శి గిరి గౌడ్, వార్డు సభ్యులు జంగిలి సునీత ఆనంద్, పాలాది మల్లీశ్వరి రంగనాథం, ముదిగొండ కవిత రమేష్, వాణి పురుషోత్తం చారి, గోసుల కొండయ్య, మసిగుండ్ల వెంకటేష్, మారేపల్లి మంజుల శ్రీను, పిల్లి దేవేందర్, శేఖర్, రాఘవరెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ మట్ట భరత్ గౌడ్, రాజు, వెంకటేష్, కొండల్, ప్రశాంత్, నాగార్జున, భరత్, డేవిడ్, నాని, బన్నీ మహేందర్, చిన్న కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## టాక్సీ ఓనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

**గోదావరిఖని మార్చి 26 మన సాక్షి**



రామగుండం కార్పొరేషన్ ఏరియా ప్రధాన చౌరస్తాలోని టాక్సీ ఓనర్స్ అసోసియేషన్ సమావేశం బుధవారం గోదావరిఖని లో నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షులు మొండెద్దుల మల్లేష్, ప్రధాన కార్యదర్శి బేతి రవి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పూర్తిస్థాయి కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ రామగుండం ఎమ్మెల్యే వర్కింగ్ ప్రెసిడెంట్ బాసాని సంతోష్, ముఖ్య సలహాదారులు: బోగొజు బాబన్న, ముస్కే లక్ష్మణ్ యాదవ్, న్యాయ సలహాదారులు: దుండె మల్లేష్, ఉపాధ్యక్షులు: అక్కేపల్లి శ్రీనివాస్, గడవేన కుమార్, ఏదుల రాజమౌళి, దొబ్బల చంద్రశేఖర్, రావుల సతీష్ సంయుక్త కార్యదర్శులు: ఎస్.కె జహంగీర్, మామిడి శంకర్, అంకెల సమ్మయ్య, పొనగంటి శ్రీనివాస్, రామగిరి శ్రీనివాస్, తోట మహేందర్, ఎండి యాసిర్, వేముల సాయి, కర్రావుల రామరాజు, కోశాధికారి: పంజాల శ్రీనివాస్, ఉప కోశాధికారి: కాశిపేట శ్రీనివాస్, ప్రచార కార్యదర్శులు: రౌతు చంద్రమౌళి, పులి నేతాజీ, ఎస్.కె ఇంతియాజ్, ఇరుగురాళ్ల వినోద్, తీగల రాజు, జనగామ సాయిరాం, బొంగోని తిరుపతి, మర్రిపల్లి మధుకర్, నంది రాకేష్, రామగిరి క్రాంతి, కార్యవర్గ సభ్యులుగా: కారంగుల శ్యాంసుందర్, మాతంగి మల్లేష్, నల్లూరి సాయికుమార్, రాసపల్లి శంకర్, పెనుగొండ కిరణ్, మామిడి సాయి, సుతారి దినేష్, మద్దెల సందీప్, రేవెల్లి సందీప్, గుడి ఇన్చార్జి లుగా: మామిడి రాజయ్య, తోటపల్లి సతీష్, దర్గా ఇన్చార్జిలుగా ఎండి గౌస్ ఎండి, వహీద్ లను నియమించడం జరిగిందని నియామకమైన నూతన కార్యవర్గం టాక్సీ ఓనర్ల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ పరిష్కరించేలా కృషి చేయాలని అధ్యక్షులు మొండెద్దుల మల్లేష్ సూచించారు. నూతన కమిటీ చే ప్రమాణ స్వీకారం చేయించారు.

## సీతారాముల కల్యాణానికి ముస్తాబైన ఆలయం.

**నారాయణపేట టౌన్, మార్చి 26 మనసాక్షి :-**



నారాయణపేట మండలం అప్పిరెడ్డిపల్లి రామదేవునిగుట్ట పై సీతారాముల కళ్యాణానికి నిర్వాహకులు ఘనంగా ఏర్పాట్లు చేశారు. ఈ నెల 27న శుక్రవారం (నేడు) నిర్వహించే సీతారాముల కళ్యాణం కోసం రామాలయాన్ని ముస్తాబుగా అలంకరించారు.ఉదయం 10 గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహించి వేద పండితుల మంత్రోచ్చారణ లతో సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సీతారాముల కళ్యాణాన్ని కనులారా వీక్షించి సీతారాముల ఆశీస్సులు పొందాలని కోరారు.కల్యాణం అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## సమస్యల పరిష్కారానికే గ్రామసభలు



**వెల్దండ మార్చి 26 మన సాక్షి:**

వెల్దండ మండలం బండోనిపల్లి గ్రామ పంచాయతీలో గురువారం ఉపసర్పంచ్ వావిళ్ళ అల్వాల్ యాదవ్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. గ్రామంలోని నీటి ట్యాంకుకు నూతన మెట్లు, అలాగే ఎనిమిదో వార్డులో అంతర్గత సిమెంట్ రహదారి నిర్మాణానికి తీర్మానం చేశామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్ రెడ్డి, వార్డు సభ్యులు వెంకట్ రెడ్డి, కిషన్ నాయక్, మందగళ్ళ రాములు, విజయలక్ష్మి, శారద, పంచాయతీ కార్యదర్శి నందకిషోర్, ఏఎస్సై మహమ్మద్ జకుల్లాహ్, అంగన్వాడి టీచర్ అనసూయ దేవి, ఆశ కార్యకర్త యాదమ్మ తదితరులు పాల్గొన్నారు..

## పర్వత్ పల్లిలో శ్రీ మల్లన్న స్వామి విగ్రహాల ప్రతిష్ఠాపన

**బషీరాబాద్ మన సాక్షి , మార్చి 26**



వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య పర్వత్ పల్లిలో శ్రీ మల్లన్న స్వామి విగ్రహాల ప్రతిష్ఠాపన ప్రత్యేక పూజలు నిర్వహించి, ఎడ్ల బండ్లపై డోలు వాయిద్యాలతో గ్రామం మొత్తం ఊరేగింపుగా తీసుకెళ్లారు. గ్రామస్తులందరూ ఈ వేడుకలో పాల్గొని స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమ విజయవంతానికి కృషి చేసిన ప్రతి ఒక్కరినీ గుర్తించి, వారి సేవలను కొనియాడుతూ ఘనంగా సన్మానం చేయడం జరిగింది. ఈ ఉత్సవాన్ని దిగ్విజయం చేయడంలో కీలక పాత్ర పోషించిన పలువురు నేతలు గ్రామ పాండురంగారెడ్డి ((గ్రామ సర్పంచ్) కుర్వ రేణుక పాండు (ఉప సర్పంచ్) హన్మపోల్ల నర్సిరెడ్డి జైపాల్ రెడ్డి , గుంటీ వెంకటరెడ్డి, గుంటీ మల్రెడ్డి, పొమిడి చంద్రశేఖర్ రెడ్డి (యువ నాయకులు)సుదర్శన్ రెడ్డి, కుర్వ తిప్పన్న, బాలకృష్ణ, రామక్రిష్ణ, బ్రహ్మం పకీరప్ప, పాండు దౌలాబాద్ సిద్దు, శ్రీనివాస్‌గోపాల్ (పూజారి) శేఖర్, గొట్టిగ రాజు ను సన్మానించారు.

## ఘనంగా స్వపరిపాలన దినోత్సవం.

**నారాయణపేట టౌన్, మార్చి26 మనసాక్షి :-**



నారాయణపేట పట్టణం లోని శివాజీ నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు.కలెక్టర్ గా అఖిల్,డి ఈ ఓ గా అర్చన , ఎం ఈ ఓ గా విగ్నేష్ ,ఎచ్ ఎం గా శిల్ప వ్యవహ రించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా 11వ వార్డ్ కౌన్సిలర్ సంకల్పురం డాక్టర్ భాగ్యవతి మల్లేష్ పాల్గొన్నారు. విద్యార్థులను ఉద్దే శించి పాఠశాల ఎచ్ ఎం బలారం నాయక్ మాట్లాడు తూ భవిషత్తులో అందరు ఉన్నత స్థాయిలో ఉండాలి అని అందరిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శంకర్ సింగ్, ఐశ్వర్య, అర్చన, సురేందర్, లక్ష్మి భాయ్,అనిత,కవిత పాల్గొనీ విద్యార్థుల నైపుణ్యాన్ని గమనించి బెస్ట్ పెర్ఫార్మన్స్ అవార్డ్స్ బహుకరించారు.

# కృత్రిమ మేధస్సు, మెషీన్ లెర్నింగ్‌పై గ్లోబల్ చర్చలు విజయవంతం

**శంకర్‌పల్లి: మార్చి 26: (మన సాక్షి):**




కృత్రిమ మేధస్సు, మెషీన్ లెర్నింగ్ లో పురోగతులపై అంతర్జాతీయ సదస్సు ఐసిఏసి ఐఎంఎల్ 2026 కార్యక్రమం శంకర్‌పల్లి మండల దొంతానపల్లి గ్రామ శివారులో గల ఇక్ఫాయ్ యూనివర్సిటీలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మరియు డేటా సైన్స్, కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్ విభాగాలు, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ బ్లాక్చైన్ సంయుక్తంగా నిర్వహించగా, రెండు రోజులపాటు జరిగిన కీలక చర్చలు, ప్రధాన ప్రసంగాలు పరిశోధనా సమర్పణలతో విజయవంతంగా ముగిశాయి. ఈ సదస్సు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖ విద్యావేత్తలు, పరిశోధకులు, పరిశ్రమ నిపుణులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి, కృత్రిమ మేధస్సు మెషీన్ లెర్నింగ్ రంగాలలో జ్ఞాన మార్పిడి ఆవిష్కరణలకు చురుకైన వేదికగా నిలిచింది. సదస్సు ప్రారంభోత్సవ సమావేశంతో ప్రారంభమై ఇక్ఫాయ్ ఉపకులపతి ప్రొఫెసర్ టి. కోటిరెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్. విజయలక్ష్మి, టెక్ డైరెక్టర్ ప్రొఫెసర్ కె. ఎల్. నారాయణ సంక్షిప్తమైన ప్రభావవంతమైన ప్రసంగాలు చేశారు. వారు సంస్థ అకడమిక్ ప్రతిభ, పరిశోధన మరియు అంతర్జాతీయ సహకారంపై తన కట్టుబాటును హైలైట్ చేశారు. ఈ సమావేశాన్ని సదస్సు కన్వీనర్ డా. సందీప్ కుమార్ పాండా, జనరల్ చైర్ డా. పవన్ కుమార్, సహ చైర్స్ డా. రోహిణి, డా. ప్రదోష్ కుమార్ నిర్వహించారు. వారు సదస్సు లక్ష్యాలు నిర్మాణాన్ని వివరించారు.

రెండు రోజులపాటు సదస్సులో ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖ సంస్థల నుండి వచ్చిన విశిష్ట వక్తల ప్రధాన ప్రసంగాలు జరిగాయి. జర్మనీలోని టెక్నికల్ యూనివర్సిటీ ఆఫ్ కెమ్నిట్జ్కు చెందిన డా. అలాజేంద్రో మస్రూర్ ట్రైన్ సిస్టమ్ ఆటోమేషన్ వైఫై సెన్సింగ్ టెక్నాలజీలలో మెషీన్ లెర్నింగ్ అనువర్తనాలపై ప్రసంగిస్తూ, వాటి అవకాశాలు, స్కేలబిలిటీ, విశ్వసనీయత డేటా గోప్యత వంటి సవాళ్లను వివరించారు. ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ రూర్కీకి చెందిన ప్రొఫెసర్ సతీష్ కుమార్ "ఆండ్రాయిడ్ మాల్వేర్ గుర్తింపులో మెషీన్ లెర్నింగ్ వినియోగం" అనే అంశంపై ప్రసంగించి, సైబర్ సెక్యూరిటీ బలోపేతంలో ఏఐ పాత్రను వివరించారు. నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మేఘాలయకు చెందిన ప్రొఫెసర్ దీప్టేందు సిన్హా రాయ్ "స్మార్ట్ డిస్ట్రిబ్యూటెడ్ సిస్టమ్స్ కోసం కంప్యూటేషనల్ ఇంటెలిజెన్స్"పై అవగాహన ఇచ్చారు.

సదస్సులో ప్రధాన ఆకర్షణగా "మానవ మేధస్సును పునర్నిర్వచించడం ఏఐ భావోద్వేగ జ్ఞాన వైవిధ్యం" అనే అంశంపై ప్యానెల్ చర్చ జరిగింది. దీనిని ఇక్ఫాయ్ యూనివర్సిటీ, సిక్కిం ఛాన్సలర్ ప్రొఫెసర్ ఓ. ఆర్. ఎస్. రావు మోడరేట్ చేశారు. ఈ చర్చలో కెనడాకు చెందిన జెన్ఈఎక్స్ టి ఏఐ సంస్థకు చెందిన స్వర్ణమౌళి మజుందార్, ఐఐటి హైదరాబాదుకు చెందిన డా. జి. నరహరి శాస్త్రి, విప్రో మాజీ వైస్ ప్రెసిడెంట్ శ్రీ వేణుగోపాల్, సుప్ర సంస్థకు చెందిన జి. ప్రసన్న, రెడ్ బెలూన్ ఏరోస్పేస్ కు చెందిన డా. సి. వి. ఎస్. కిరణ్ పాల్గొన్నారు.

# విద్యార్థులకు రోడ్డు భద్రతపై వ్యాసరచన పోటీలు

**నారాయణపేట టౌన్, మార్చి 26 మనసాక్షి:-**




నారాయణపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జాజాపూర్ ఉన్నత పాఠశాలలో అరయ్ అలైవ్ మూడో విడత రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు రోడ్డు భద్రత నియమాలపై వ్యాసరచన పోటీ నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థు లకు చిన్నప్పటినుంచే రోడ్డు భద్రత నియమాలపై అవగా హన కల్పించడం ఎంతో అవసరమని ఎస్ఐ గాయత్రి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రోడ్డు దాటేట ప్పుడు జాగ్రత్తలు పాటించ డం, ట్రాఫిక్ సిగ్నల్స్‌ను గౌర వించడం, హెల్మెట్ సీట్‌బెల్ట్ వినియోగం, వేగ నియంత్రణ వంటి ముఖ్యమైన రోడ్డు భద్ర త నియమాలను వివరించా రు. చిన్న వయసులోనే ఈ నియమాలు అలవర్చుకుంటే భవిష్యత్తులో రోడ్డు ప్రమా దాలు గణనీయంగా తగ్గు తాయని పేర్కొన్నారు. వ్యాసరచన పోటీలో విద్యా ర్థులు ఉత్సాహంగా పాల్గొని రోడ్డు భద్రత ప్రాముఖ్యతను తమ మాటల్లో వివరించారు. పోటీలో ఉత్తమ ప్రతిభ కనబ రిచిన విద్యార్థులను అభినం దించి అవార్డులు ప్రధానం చేశారు. ఇటువంటి అవగాహన కార్యక్రమాలు విద్యా ర్థుల వ్యక్తిత్వ వికాసానికి, సమాజ భద్రతకు దోహద పడతాయని తెలిపారు. అరయ్ అలైవ్ కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు తప్పని సరిగా పాటించి, సురక్షిత ప్రయాణాన్ని అలవర్చు కోవాలని విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యా యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# చలివేంద్రం ఏర్పాటు

**నాచారం,మార్చి26,మన సాక్షి:**




నాచారం, హెచ్ఎంటీ నగర్ డివిజన్‌లో సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. చలివేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ నాచారం మరియు హెచ్ఎంటీ నగర్ డివిజన్లలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగుతున్నాయన్నారు. ఈ అభివృద్ధి పనులు మరియు ప్రజా మద్దతుతో రాబోయే ఎన్నికల్లో రెండు డివిజన్లలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం ఖాయం అని ధీమా వ్యక్తం చేశారు. వి.ఎస్. ప్రకాశ్ రెడ్డి చేస్తున్న సేవలను ప్రశంసించారు. పేద ప్రజల కోసం చలివేంద్రం ఏర్పాటు చేయడం ఎంతో మంచి కార్యక్రమమని ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్ గౌడ్, జి కృష్ణ రెడ్డి, సాయి, మహేష్ యాదవ్, ఎం శ్రీనివాస్ రెడ్డి, రమేష్, అశ్వత్థామ రెడ్డి, భువన గౌడ్, సునీల్ రెడ్డి, యూసుఫ్, కృష్ణ యాదవ్, నర్సింగ్ రావు, సుధాకర్ రెడ్డి, షరీఫుద్దీన్, ఫిరోజ్, రేవంత్, షాహిద్, పాషా, నరేష్, నరేష్, రఘు, కృపాకర్, రాజేష్, శశి, బాల్‌రాజ్, శ్రీనివాస్ రెడ్డి, ఉమ, సునీత, సుష్మిత, మమత, విజయమ్మ, యాస్మీన్ తదితరులు పాల్గొన్నారు.

# మరకత శివాలయంలో శత రుద్రాభిషేకం



**శంకర్‌పల్లి: మార్చి 26: (మన సాక్షి):**

శంకర్‌పల్లి మండల పరిధిలోని చందిప్ప గ్రామ శివారులో గల 11 వ శతాబ్దానికి చెందిన మహిమగల శ్రీ బ్రహ్మసూత్ర మరకత లింగేశ్వర స్వామి దేవస్థానంలో గురువారం తెలంగాణ వీరశైవ అర్చక పురోహిత సంక్షేమ సంఘం వారి ఆరుద్రోత్సవ మహాన్యాస పూర్వక శత రుద్రాభిషేక కార్యక్రమం ఘనంగా జరిగింది. అనంతరం శంకరపల్లి మున్సిపల్ చైర్మన్ ప్రవీణ్ కుమార్ దంపతులు పురోహితులకు అన్నదానం నిర్వహించారు. అన్నదానం ఏర్పాటుచేసిన మున్సిపల్ చైర్మన్ దంపతులను పురోహితులు స్వామివారి శేష వస్త్రంతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, అర్చకులు ఉన్నారు.

# ఉచిత పరీక్షల హెల్త్ క్యాంపు సక్సెస్


**శంకర్‌పల్లి: మార్చి 26: (మన సాక్షి):**



శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని సాయికాలనీలో గల సాయిబాబా ఆలయం ఆధ్వర్యంలో గురువారం సాన్స్ స్కిన్ హాస్పిటల్ వారి ఉచిత పరీక్షల హెల్త్ క్యాంపు సక్సెస్ అయిందని డా. సాయిసింధు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ అడ్వాన్స్ స్కిన్ కాస్మోటిక్ వైద్య సేవలు పట్టణ, మండల ప్రజలకు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. హైదరాబాద్ నగరానికి వెళ్లే అవసరం లేకుండా ప్రజలకు చేరువలోనే సాంగ్స్ సాన్స్ హాస్పిటల్ ఉందని డాక్టర్ చెప్పారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరానికి ప్రజలు హాజరై సేవలను వినియోగించుకున్నారు. మొత్తం 50 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. చిన్న సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ప్రజలకు వైద్య సేవలు చేయడమే తన ప్రధాన లక్ష్యమని చెప్పారు. శిబిరం అనంతరం సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామి వారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# శ్రీరామనవమికి ముస్తాబైన రామాలయాలు

**రామసముద్రం మార్చి 26 మనసాక్షి**



అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలంలో శ్రీరామనవమిని పురస్కరించుకుని మండలంలో ప్రసిద్ధి చెందిన మండల కేంద్రంలోని బజారు వీధిలో కొలువైనశ్రీ కోదండరాముడు, తిరుమల రెడ్డిపల్లె సీతారామాంజనేయ స్వామి ఆలయం, జంగాలపల్లె, ఎర్ర బోయిన పల్లె,చెంబకూరు, కేసీ పల్లె, బైరాజుపల్లె, బురుజుపల్లి, కొత్తూరు వనగానిపల్లె, మట్లవారిపల్లె, తప్పసాని పల్లె, మనేవారి పల్లె మరియు పలు గ్రామాల్లో కొలువైన స్వామివార్లు, శుక్రవారం శ్రీరామనవమి వేడుకలు శ్రీ సీతారాముల కళ్యాణోత్సవ ఏర్పాట్లను గ్రామస్థులు, కార్యనిర్వాహకులు, ఆలయ ధర్మకర్తలు ఒక ప్రకటనలో పేర్కొన్నారు .ఈ సందర్భంగా శ్రీరామనవమి ఉత్సవాలు జరిగే గ్రామపెద్దలు కార్యనిర్వాహకులు మాట్లాడుతూ మండలంలో వివిధ గ్రామల్లో నిర్వహించే శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడ సాంప్రదాయంగా వేద పండితులచే పంచామృత అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, సీతారాముల వారి కళ్యాణం, ఆలయం దగ్గర అన్నదానం, సాయంకాలం ఆలయాలు వద్ద కోలాటాలు, చెక్క భజనలు, రామకీర్తనలు, గ్రామోత్సవం తదితర పూజా కార్యక్రమాలు అత్యంత శోభాయమానంగా నిర్వహించడం జరుగుతుందని శ్రీరామనవమి వేడుకలు, రాములోరి కళ్యాణం వేడుకలను వీక్షించి స్వామి వారిని దర్శించుకుని ఆశీస్సులు పొందాలని ఆలయాల అర్చకులు గ్రామపెద్దలు, కార్యనిర్వాహకులు పిలుపునిచ్చారు.

# కన్నుల పండుగగా శ్రీ బండెమ్మ అమ్మవారి రథోత్సవం

**రామసముద్రం,మార్చి26 మనసాక్షి**



అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలంలోని కాప్పల్లె గ్రామపంచాయతీలోని గజ్జలవారిపల్లె గ్రామంలో గ్రామ పెద్దలు, గ్రామస్తులు ఆధ్వర్యంలో గురువారం శ్రీ బండెమ్మ అమ్మవారి రథోత్సవం కన్నుల పండుగగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయపూజారి అమ్మ వారిని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి,తేరులో కొలువు ఉంచి పురవీధులలో రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అమ్మ వారి రథోత్సవం తిలకించడానికి చుట్టూ ప్రక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మ వారికి హారతులు పట్టి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు,అమ్మ వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. రథోత్సవానికి తిలకించడానికి విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాధాలు అన్నదాణం,మజ్జిగ,పంపిణీ చేసి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు,ప్రజల అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రథోత్సవంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై ఉమామహేశ్వర్ రెడ్డిఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది తో బందో బస్త్ నిర్వహించారు.

# నూతన పోలీస్ స్టేషన్ పనులు త్వరగా పూర్తి చేయాలి

## ఫ్యూచర్ సిటీ కమిషనర్ సుధీర్ బాబు



**శంకర్‌పల్లి: మార్చి 26: (మన సాక్షి):**

శంకర్‌పల్లి నూతన పోలీస్ స్టేషన్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఫ్యూచర్ సిటీ కమిషనర్ సుధీర్ బాబు కాంట్రాక్టర్లకు సూచించారు. పనులను నాణ్యతగా చేయాలని ఆదేశించారు. అన్ని హంగులతో పోలీస్ స్టేషన్ నిర్మాణం జరుగుతోందని సిపి సుధీర్ బాబు అన్నారు. సిపి వెంట చేవెళ్ల ఏసీపీ కిషన్ గౌడ్, సిఐ మీర్ ముదసర్ అలీ, ఎస్సైలు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

# శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన ఫ్యూచర్ సిటీ కమిషనర్




**శంకర్‌పల్లి: మార్చి 26: (మన సాక్షి):**

శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్ ను గురువారం ఫ్యూచర్ సిటీ కమిషనర్ సుధీర్ బాబు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ లో పెండింగ్ లో ఉన్న కేసుల ఫైళ్లను చేవెళ్ల ఏసిపి కిషన్ గౌడ్ తో కలిసి పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించాలని సీఐ మీర్ ముదసర్ అలీకి సూచించారు. ఎస్ఐలు సురేష్, దేవేందర్, శ్రీశైలం, బేతప్ప, మంజుల, పోలీసు సిబ్బంది ఉన్నారు.

# శ్రీ రామనవమి వసంత నవరాత్రులు

## అభిషేకం విశేష అలంకరణ

**మేడ్చల్ మల్కాజిగిరి మర్చి 26 మనసాక్షి**



సీతారామచంద్ర మూర్తి ఘనంగా అభిషేకం విశేష అలంకరణ. శ్రీ రామనవమి వసంత నవరాత్రులు సందర్భంగా 8 వ రోజు సీతారామచంద్ర స్వామి వారికి మంగళ స్నానం సప్నం విశేష సుగంధ ద్రవ్యాలతో పంచామృత అభిషేకం కార్యనిర్వాహణాధికారి ఏ బి రవీంద్ర రెడ్డి పర్యవేక్షణలో ఆలయ అర్చకులు డా తులసి వెంకట రమణా చార్యులు ఆధ్వర్యంలో గురువారం ఆనంద్ బాగ్ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయం లో ఘనంగా నిర్వహించారు. అనంతరం మహిళా భక్తురాళ్ళు ఆధ్వర్యంలో వసంతోత్సవం నిర్వహించి అమ్మవారికి వస్త్రాలు సారా సమర్పించారు. సీతా రామచంద్ర మూర్తి సహిత లక్ష్మణ హనుమ స్వాములు కు ప్రత్యేక అలంకరణ నిర్వహించారు, ఈ కార్యక్రమంలో ఆలయ జూనియర్ అసిస్టెంట్ సంద్ర సుధాకర్, ఆలయ మాజీ సభ్యులు సానాధి శంకర్, భక్తులు దేవి, సునీత, పద్మజా రాజ్యలక్ష్మి, సుధారాణి ,జయశ్రీ రాజేశ్వరి, భాను రత్నమాల, కొండ లలిత, సూర్యనారాయణ మూర్తి, శ్రీనివాస్ రావ్,బాలు, రేఖ తదితర భక్తులు పాల్గొన్నారు.

# నేటి నుంచి మిర్యాలగూడలో శ్రీ మహాలక్ష్మి యాగం

## ఏర్పాట్లు పూర్తి





**మిర్యాలగూడ, మార్చి 26, మన సాక్షి :**



నల్గొండ జిల్లా మిర్యాలగూడలో శ్రీ శ్రీ శ్రీ త్రిదండి శ్రీ రామచంద్ర రామానుజ జీయర్ స్వామి వారి సంకల్పంతో వారి ప్రత్యక్ష పర్యవేక్షణలో శ్రీ మహాలక్ష్మి యాగం ఈనెల 27వ తేదీ నుంచి ప్రారంభం కానున్నది. మిర్యాలగూడ పట్టణంలోని ఎన్ఎస్పి క్యాంపు గ్రౌండ్ లో ఏర్పాట్లు పూర్తి చేశారు. శ్రీ భూ, గోదా దేవి సమేత గోవింద పెరుమాళ్ళ అనుగ్రహంతో ఈ యాగం నిర్వహిస్తున్నారు. వేలాది మంది భక్తులు యాగంలో పాల్గొనేందుకు గాను ఏర్పాట్లను పూర్తి చేశారు. లోక కళ్యాణార్థం శ్రీ మహాలక్ష్మి యాగం నిర్వహిస్తున్నారు. 27వ తేదీన శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయం నుండి ఎన్ఎస్పి క్యాంపు గ్రౌండ్ వరకు శోభాయమానంగా వేలాదిమంది మంగళ శ్రీమూర్తులు, మంగళ ద్రవ్యాలు అయినటువంటి పసుపు, కుంకుమలతో అత్యంత వైభవంగా మంగళ వాయిద్య కారులతో శ్రీ లక్ష్మీ నారాయణ లకు స్వాగత నీరాజనాలను ఏర్పాటు చేస్తారు. అనంతరం పూజ పుణ్యాచనం, తీర్థ ప్రసాదాల కార్యక్రమం ఉంటుంది. 27వ తేదీ నుంచి మొదలయ్యే శ్రీ మహాలక్ష్మి యాగ కార్యక్రమాలు ఏప్రిల్ 1వ తేదీ వరకు బుధవారం వరకు కొనసాగుతాయి. యాగ ఏర్పాట్లను రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పర్యవేక్షణ చేస్తున్నారు. రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కోశాధికారి గందె రాము గురువారం ఏర్పాట్లను పరిశీలించారు. వారితో పాటు ఎస్సై రాంబాబు, రేపాల పురుషోత్తం రెడ్డి, పాల్వాయి సురేష్ తో పాటు యాగ కమిటీ సభ్యులు ఉన్నారు. వేలాదిమంది భక్తులు యాగం లో పాల్గొనేందుకు, వీక్షించేందుకు యాగశాల ఏర్పాట్లను పూర్తి చేశారు.

# అభివృద్ధిలో పరిశ్రమల భాగస్వామ్యం మరింత పెరగాలి

**పటాన్చెరు, మార్చి 26(మనసాక్షి) :**



బొల్లారం డివిజన్ పరిధిలోని పరిశ్రమలు తమ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) నిధుల ద్వారా గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి మరింత సహకరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు.

గురువారం అమీన్ పూర్ సర్కిల్ బొల్లారం డివిజన్ పరిధిలో ఐటీసీ పరిశ్రమ సౌజన్యంతో 32 లక్షల రూపాయలతో కొనుగోలు చేసిన కంప్యూటర్లు, చెత్త సేకరణ ఆటోలు, త్రీ చక్ర సైకిళ్ల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే జి.ఎం.ఆర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బొల్లారం పరిధిలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, తెలంగాణ మోడల్ స్కూల్ పాఠశాలలకు 15 కంప్యూటర్లు, రెండు ప్రింటర్లు, బొల్లారం మున్సిపల్ విభాగానికి 8 చెత్త సేకరణ ఆటోలు, దివ్యాంగుల కోసం 3 త్రి చక్ర సైకిళ్లను లను ఎమ్మెల్యే జిఎంఆర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐటీసీ కంపెనీ తన సామాజిక బాధ్యతలో భాగంగా పాఠశాలల అభివృద్ధికి, బొల్లారం డివిజన్ పరిధిలో పారిశుధ్యం పెంపొందించేందుకు సహకారం అందించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లోనూ మరిన్ని అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కోరారు.

పటాన్ చెరు నియోజకవర్గంలో ప్రభుత్వం అందించే నిధులతో పాటు స్థానికంగా ఏర్పాటుచేసిన పరిశ్రమల సహకారంతో సిఎస్ఆర్ నిధులను అభివృద్ధి పనులకు కేటాయిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం, పరిశ్రమలు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు కలిసి పనిచేస్తే అభివృద్ధి సుసాధ్యం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అత్యున్నత ప్రమాణాలతో విద్యను అందిస్తున్నామని.. ప్రతి విద్యార్థి లక్ష్యంతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అమీన్ పూర్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, సిఐ రవీందర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి బాల్ రెడ్డి, బిఆర్టియు రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు, సీనియర్ నాయకులు హనుమంత్ రెడ్డి, రవీందర్ రెడ్డి, జైపాల్ రెడ్డి,లక్ష్మా రెడ్డి,ఐటీసీ సంస్థ జనరల్ మేనేజర్ శ్రీనివాస్, ప్లాంట్ హెడ్ సుబ్రహ్మణ్యం, మాజీ ప్రజాప్రతినిధులు వేణుపాల్ రెడ్డి, సాయి కిరణ్ రెడ్డి,శ్రీకాంత్ యాదవ్, బీరప్ప యాదవ్, సతీష్,రత్నం, కృష్ణ, బీసీ అధ్యక్షులు శ్రీశైలం యాదవ్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సీసీ కెమెరాలు ఏర్పాటు అభినందనీయం



**మనసాక్షి, నర్సింహులపేట:**

మహబూబాబాద్ జిల్లాలోని నర్సింహులపేట మండలం వంతడపుల గ్రామపంచాయతీ పరిధిలో ప్రజల భద్రతకు మరింత బలోపేతం చేస్తూ "ఎరైవ్ ఎలివ్" కార్యక్రమం భాగంగా 7 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం అభినందనీయం అని ఎస్ఐ మాలోత్ సురేష్ అన్నారు. గురువారం రోజున ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ శబరిష్ ఆదేశాల మేరకు గ్రామ సర్పంచ్ మాలోత్ బాలునాయక్ ఆధ్వర్యంలో,గ్రామ ప్రజల సహకారంతో ఈకార్యక్రమం విజయవంతంగా అమలైందని ఆయన తెలిపారు. గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల నేర నియంత్రణతో పాటు, అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గుర్తించడం సులభమవుతుందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ సురేష్ గ్రామసర్పంచ్ బాలునాయక్‌ను శాలువాతో సత్కరించి అభినందించారు. ఇతర గ్రామాలు కూడా వంతడపుల గ్రామాన్ని ఆదర్శంగా తీసుకుని,సమాజ భద్రత కోసం ముందుకు రావాలని సూచించారు.

## గొడుగుల పంపిణీ

**గరిడేపల్లి మార్చి 26 మనసాక్షి**



లయన్స్ జిఎంటి కో ఆర్డి నే టర్ గుడిపూరి వెంకటేశ్వరావు సౌజన్యంతో లయన్స్ క్లబ్ ఆఫ్ నేరేడుచర్ల ఆధ్వర్యం లో రోడ్డువెంట చెప్పులు కుట్టు కుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న పాదరక్షల మరమ్మతుల కార్మికుడు గరిడేపల్లి గ్రామ వాసి మీసాల నాగయ్య కు డిస్ట్రిక్ట్ జిఎంటి కోఆర్డినేటర్ ఎంజేఎఫ్ లయన్ గుడిపూరి వెంకటేశ్వరావు సౌజన్యం తో గొడుగు పంపిణీ చేశారు వేసవికాలం ఎండలు పెరుగుతున్న సమయంలో వీధి కార్మికునికి గుడిపూరి వెంకటేశ్వరావు సొంతఖర్చులతో గొడుగులను పంపిణీచేయడం వల్ల హర్షంవ్యక్తం చేస్తూ ధన్యవాదాలు తెలిపారు ఇట్టి కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు గుండ్రెడ్డి సైదిరెడ్డి ,మాజీ అధ్యక్షులు జిలకర రామస్వామి,సభ్యులు జిచావయ్య ,త్రిపురం సుధాకరరెడ్డి,గ్రామ సర్పంచ్ మేకపోతుల వెంకటమ్మ చంద్రయ్య ,చిక్కుల మట్టయ్య గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## బుడ్డారెడ్డి గూడెంలో నూతన సీసీ రోడ్డు పనులు ప్రారంభం



**గుర్రంపోడు, మార్చి26,మన సాక్షి:**

నల్గొండ జిల్లా గుర్రంపోడు మండలం బుడ్డారెడ్డి గూడెం,గ్రామాభివృద్ధిలో భాగంగా బుడ్డారెడ్డి గూడెం గ్రామ పంచాయతీ పరిధిలో నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఘనంగా ప్రారంభించారు. సర్పంచ్ సింగం బాలకృష్ణ ఈ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బొమ్ము శ్రీనివాస్ యాదవ్ తో పాటు గ్రామానికి చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. గ్రామాల్లో రవాణా సౌకర్యాలను మెరుగుపరచడమే లక్ష్యంగా ఈ రహదారి నిర్మాణాన్ని చేపట్టినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బొల్లం వెంకన్న, రాముడు, శంకర్, బొల్లం ప్రశాంత్, బాలయ్య, యాదవ రాజు, శ్రీరాముల వెంకన్న, లక్ష్మీనారాయణ, ఇతర గ్రామస్తులు పాల్గొన్నారు. సి సి నిర్మాణం ప్రారంభం కావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## బుద్ధవనం సందర్శించిన అటవీశాఖ ప్రిన్సిపల్ సీసీ ఎఫ్

**నాగర్జున సాగర్, మార్చి,26, మన సాక్షి :**



నాగార్జునసాగర్ లో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించిన బుద్ధవనాన్ని గురువారం తెలంగాణ రాష్ట్ర అటవీ శాఖ ప్రిన్సిపాల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ సి.సువర్ణ కుటుంబ సమేతంగా సందర్శించారు. నాగార్జునసాగర్ సందర్శనలో భాగంగా నాగార్జునసాగర్ అటవీ డివిజన్ పరిధిలోని నెల్లికల్ వ్యూ పాయింటును సందర్శించిన అనంతరం బుద్ధవనాన్ని చేరుకొని బుద్ధ చరిత వనములోని బుద్ధ పాదాల వద్ద పుష్పాంజలి ఘటించారు. మహా స్తూపం సమావేశా మందిరంలో బుద్ధవనం విశేషాలు తెలిపే లఘు చిత్రాన్ని వీక్షించారు. అనంతరం మహాస్తూపంలోని ధ్యాన మందిరంలో బుద్ధ జ్యోతులను వెలిగించారు. వీరికి బుద్ధవనం ఎస్టేట్ మేనేజర్ రవిచంద్ర బుద్ధ వనం కండువాలతో బ్రోచర్లతో సత్కరించారు. వీరికి స్థానిక టూరిజం గైడ్ సత్యనారాయణ బుద్ధవనం విశేషాలను తెలియజేశారు. వీరితోపాటు అమ్రాబాద్ అటవీ సి సి ఎఫ్ సునీల్ హిరావత్ నల్గొండ జిల్లా అటవీ శాఖ అధికారి శాంతారామ్,సాగర్ ఫారెస్ట్ డివిజనల్ అధికారి సంగీత, శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

## ఉత్కంఠంగా సాగిన బార్ అసోసియేషన్ ఎన్నికలు.

### ఇద్దరికీ చెరిసమానం రావడంతో డ్రాలో జ్ఞాన సుందర్ కు వరించిన అధ్యక్ష పదవి.

**తుంగతుర్తి మన సాక్షి మార్చి 26.**



తుంగతుర్తి:- మండల కేంద్రంలోని జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో గురువారం జరిగిన బార్ అసోసియేషన్ ఎన్నికలు ఉత్కంఠంగా సాగింది. అధ్యక్షుడిగా అన్నెపర్తి జ్ఞాన సుందర్, తాళ్లపల్లి సత్యనారాయణ ఇద్దరు బరిలో నిలవగా 16 ఓట్ల గాను ఇద్దరికీ సమానం రావడంతో డ్రా తీయగా అన్నెపర్తి జ్ఞానసుందర్ కు అధ్యక్ష పదవి వరించిందని ఎన్నికల అధికారి ఎస్కే.వజీర్ తెలిపారు. దీంతో జ్ఞాన సుందర్ నాలుగోసారి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జ్ఞాన సుందర్ మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానని, కోర్టు నూతన భవన నిర్మాణం కోసం కృషి చేస్తానని, న్యాయవాదులకు కావాల్సిన హెల్త్ కార్డులు, నూతన కోర్టు భవనంలో రూ.1లక్షతో లైబ్రరీ నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. తన ఎన్నికకు సహకరించిన న్యాయవాదులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వారిని పలువురు శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

## పిట్టలగూడెంలో ఘనంగా జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

**గుర్రంపోడు, మార్చి 26,మన సాక్షి:**



నల్గొండ జిల్లా గుర్రంపోడు మండలం పిట్టలగూడెం గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ సీతా రామచంద్ర స్వామి కళ్యాణ మహోత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన నల్గొండ జిల్లా స్థాయి కబడ్డీ టోర్నమెంట్ గురువారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. ఈ క్రీడా సంబరాన్ని గుర్రంపోడు ఎస్సై వెంకన్న, గ్రామ సర్పంచ్ సూదిని సునీత జగదీశ్వర్ రెడ్డి రిబ్బన్ కట్ చేసి అధికారికంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అంబేద్కర్,వార్డ్ మెంబర్లు,గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్.ఐ, సర్పంచ్ మాట్లాడుతూ..గ్రామీణ క్రీడలు యువతలో ఐక్యతను, క్రమశిక్షణను పెంపొందిస్తాయని, క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో రాణించాలని పిలుపునిచ్చారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు పలువురు దాతలు ముందుకు వచ్చి భారీ నగదు బహుమతులను ప్రకటించారు. మారెడ్డి యాదగిరి రెడ్డి మొదటి బహుమతిగా ₹20,116/-మారెడ్డి యోగంధర్ రెడ్డి రెండో బహుమతిగా ₹15,116/-,మారపాక అంబేద్కర్ మూడో బహుమతిగా ₹10,116/-, పాసు శ్రీ శైలం నాలుగో బహుమతిగా ₹5,116/-, బొల్లం సత్యనారాయణ ఐదో బహుమతిగా ₹3,116/- నగదును కేటాయించారు. ఆర్గనైజర్స్ దాతగా కట్టు నర్సింహ ₹5,016/- సహకారాన్ని అందించారు.

మార్చి 26 నుండి 28 వరకు మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో ఉమ్మడి జిల్లా నలుమూలల నుండి అనేక జట్లు పాల్గొంటున్నాయి. ఈ పోటీలను తిలకించేందుకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు వచ్చారు. ఈ టోర్నమెంట్ నిర్వహణ బాధ్యతలను బైరి గణేష్,జిల్లా శ్రీకాంత్,సింగం రాజు, బొల్లం కృష్ణ,పాలడుగు సతీష్, కట్ట మనోహర్,బండారి సతీష్ చూస్తున్నారు. నలుమూలల నుండి క్రీడాభిమానులు భారీగా తరలి వచ్చారు.

## రికవరీ చేసిన సెల్ఫోన్ల అప్పగింత

**చింతపల్లి. మార్చి 26 మన సాక్షి**



వివిధ కారణాలవల్ల తమ విలువైన సెల్ ఫోన్లు పోగొట్టుకున్న వ్యక్తులు చింతపల్లి మండల పోలీస్ స్టేషన్లో పదిమంది వరకు సెల్ ఫోన్ పోయిందని ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై చింతపల్లి పోలీసులు సెల్ ఫోన్లపై ఆరా తీస్తూ ఈ మధ్య కొత్తగా వచ్చిన సీఇఐఆర్ పోర్టల్ ద్వారా పోయిన సెల్ ఫోన్లను గుర్తించి దొరికిన వారి దగ్గర నుండి తెప్పించి సెల్ఫోన్ పోయిందని ఫిర్యాదు అందజేసిన బాధితులను పిలిపించి గురువారం చింతపల్లి ఎస్సై ముత్యాల రామ్మూర్తి ఆధ్వర్యంలో, స్థానిక పోలీస్ స్టేషన్లో సెల్ఫోన్ పోగొట్టుకున్న బాధితులకు పోలీస్ సిబ్బందితో కలిసి వారి వారి సెల్ఫోన్లను అందజేశారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులు సెల్ ఫోన్ ఎస్ఐ అందజేయడంతో ఎస్సై రామ్మూర్తికి, పోలీస్ సిబ్బందికి బాధితులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పోలీసులు ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులపై దృష్టి సారిస్తే ఎన్నో ఆర్థిక నేరాలు అరికట్టవచ్చున ని పేర్కొన్నారు. సేవా దృక్పథంతో పనిచేసే పోలీసులను ప్రజలు ఎప్పుడు గుర్తించుకుంటా రన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, సెల్ ఫోన్ బాధితులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఆర్టిజన్ ఉద్యోగులకు సర్వీస్ రూల్స్ అమలు చేయాలి

**నల్లగొండ మార్చి 26, మనసాక్షి.**



విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులకు విద్యా అర్హతలను బట్టి కన్వర్షన్ సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి ఇవ్వాలని కోరారు.

ఆర్టిజన్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏప్రిల్ 8న తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో జరిగే సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిస్తూ గురువారం స్థానిక డివిజన్ ఆఫీసుల ముందు ధర్నాలో భాగంగా నల్గొండ డివిజన్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కు వివిధ సంఘాలు మద్దతు తెలిపాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, 3 27 యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి సమ్మిరెడ్డి, జేఏసీ చైర్మన్, కన్వీనర్ లు జిట్టబోయిన లింగస్వామి యాదవ్, మద్ది శ్రీనివాస్ యాదవ్ లు మాట్లాడుతూ విద్యుత్ సంస్థలు పనిచేస్తున్న ఆర్టిజన్ ఉద్యోగులకు ఏ పి ఎస్ సి బి సర్వీస్ రూల్స్ అమలు చేయడంతో పాటు విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులకు విద్యా అర్హతలను బట్టి కన్వర్షన్ ఇవ్వాలని కోరారు. అలాగే ఆర్టిజన్లుగా గుర్తించకుండా మిగిలిపోయిన కార్మికులను ఆర్టిజన్ కార్మికులుగా గుర్తించాలని కోరారు. టీజీ ఎస్పీడీసీఎల్ మాదిరిగా టి. జి. ఎన్. పి. డి. సి. ఎల్. అన్ మ్యాన్డ్ వర్కర్స్ ఆర్టిజన్ గా గుర్తించాలని, అలాగే మీటర్ రీడింగ్ కార్మికులు, కలెక్షన్ ఏజెంట్లు, ఎస్ పి ఎం వర్కర్లు, సెక్యూరిటీ గార్డులకు జీవో నెంబర్ 11 ప్రకారం కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అవుట రవీందర్, 1104 యూనియన్ డివిజన్ కార్యదర్శి పురం రాంబాబు, 1104 డివిజన్ ప్రెసిడెంట్ మైనం ఊషయ్య, టి ఆర్ వి కె ఎస్ డివిజన్ కార్యదర్శి, జేఏసీ సీనియర్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, జేఏసీ కో కన్వీనర్లు వేణుగోపాల్ రెడ్డి, దుప్పలపల్లి రమేష్, బొజ్జ సహదేవ్, మేకల బిక్షమయ్య, పెరిక శేఖర్, విజయ్, ఉమాదేవి, రఫీయా, శైలజ, లింగారెడ్డి, భూషణం, ఆవుల పరమేష్, శ్రీపతి రమేష్, ఎస్.కె ఖాన్, మురళి, మేకల నరసింహ, మల్లేష్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## రహదారి భద్రత నియమాలు పాటిస్తూ వాహనాలు నడపాలి

**గరిడేపల్లిమార్చి 26. మనసాక్షి**



గరిడేపల్లి మండల కేంద్రంలోని మెయిన్ రోడ్డుపై వాహనదారులకు మండల ప్రజలకురోడ్లపై ఉన్న లైన్ లను అనుసరించాలి అని గరిడేపల్లి ఎస్సై చల్లి కట్టి నరేష్ మాట్లాడుతూ,ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో జాతీయ రహదారిపై అరైవ్ ఆలైవ్ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించి ప్రయాణికులకు, ఆటో డ్రైవర్లకు, స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి డ్రైవర్లకు వివరించారు. రోడ్డు ప్రయాణ సమయంలో ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటించడం ద్వారానే ప్రమాదాలు నివారించవచ్చునని తెలిపారు. రోడ్డుపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ బాధ్యతగా నడుచుకోవాలని రోడ్డు నియమ నిబంధనలను పాటించాలని కోరారు. ఇతర వాహనాలను ఓవర్ టేక్ చేసేటప్పుడు జాగ్రత్తగా వెళ్ళాలి, అతి వేగంగా వాహనాలు నడపవద్దు అని కోరారు. వాహనాలు నడిపేవారు త్రిబుల్ రైడింగ్ తో వెళ్లొద్దని డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నవారు మాత్రమే వాహనాలు నడపాలని లేనియెడల చట్టరీ చర్యలు తప్పవని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో పట్టణ ప్రజలు ఆటో డ్రైవర్లు ద్విచక్ర వాహనదారులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీరామనవమి వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

**అనంతగిరి మార్చి 26 మన సాక్షి**



అనంతగిరి మండలపరిధిలోని వాయిల సింగారం గ్రామంలో రామాలయంలో శ్రీరామనవమి కళ్యాణ మహోత్సవం ఏర్పాట్లు పూర్తి గుడి 13వ వార్షికోత్సవ సందర్భంగా గ్రామంలో ఉన్నటువంటి సీతారామచంద్రస్వామి కళ్యాణము మరియు అన్నదాన కార్యక్రమమునకు సర్వం పూర్తిచేసిన రామాలయ కమిటీ వారు గత 12 సంవత్సరాల నుండి దాతల సహాయ సహకారాలతోటి సీతారామచంద్రస్వామి కళ్యాణము అన్నదాన కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా 13వ సంవత్సరం కూడా దాతల సహాయ సహకారాలతోటి ముందుకు తీసుకెళ్లడం జరుగుతుంది గుడి నిర్మితమైన తర్వాత ప్రతిరోజు కూడా స్వామివారికి పూజా కార్యక్రమంలో క్రమం తప్పకుండా నిర్వహించటం జరుగుచున్నది ఈ కళ్యాణ మహోత్సవంలో ప్రజలు మరియు చుట్టుపక్కల గ్రామాల వారు సుమారు మూడు వేల మంది కళ్యాణము తిలకించే విధముగా కళ్యాణ అనంతరం భోజనాలు ఏర్పాటు పూర్తి అయినాయని రామాలయం కమిటీ తెలిపారు గుడి అర్చకులైన సూర్యనారాయణ ఆధ్వర్యంలో గుడి చైర్మన్ ఇంటి నుండి పట్టు వస్త్రాలు తలంబరాలు తీసుకుని వచ్చి కళ్యాణం నిర్వహించడం జరుగుతున్నది

# భూభారతి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

## జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట మార్చి 26 మనసాక్షి**




జిల్లాలో పెండింగ్ లో ఉన్న సాదా బైనామ, భూ భారతి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. గురువారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలోని వీసీ హాల్ నందు జిల్లాలోని ఆర్డీవోలు, తహసిల్దార్ లతో పెండింగ్ సాదాబైనమా, భూభారతి, భూ సమస్యలపై వేబేక్స్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలుదారు, అమ్మకందారు ఇద్దరి నుంచి అఫిడవిట్ తీసుకోవాలన్న నిబంధనతో క్షేత్రస్థాయిలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కొనుగోలుదారు నుంచి మాత్రమే అఫిడవిట్ తీసుకునేలా జీవో 76ను జారీ చేసినట్లు తెలిపినారు.సాదా బైనామా ద్వారా భూములు అమ్ముకునే సమయంలో అమ్మే వ్యక్తి రికార్డు నందు నమోదు కలిగి ఉండాలని, అదే విధంగా పట్టా భూములను మాత్రమే ప్రాసెస్ చేయాలని సూచించారు. వీటితో పాటు భూమి మీద పొజిషన్ తో పాటు, 5ఎకరాల లోపు భూములు కలిగివున్న వారికీ మాత్రమే పరిష్కరించాలన్నారు. నోటీస్ జారీ చేసి 30 రోజులు పూర్తి అయిన వాటిని పరిష్కరించాలని, క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి పంచనామా చేయాలని తెలిపారు. చాలన్ కట్టే ముందు ఒకటికి రెండు సార్లు తనిఖీ చేసి స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు సరిచేసుకోవాలని ఆదేశించారు. సాదా బైనమా దరఖాస్తులకు పరిష్కారం తొందరగా పూర్తి చేసి అర్హులైన వారికి 13 (బీ) పట్టాలను జారీ చేయాలని తెలిపారు. భూభారతి పెండింగ్ దరఖాస్తులను 15 రోజుల్లో పరిష్కారం చూపాలని, అలాగే కోర్టు కేసులు, హైకోర్టులో నమోదైన కేసులకు విధిగా జవాబు ఇవ్వాలన్నారు. అదే విదంగా స్లాట్స్ బుకింగ్ క్యాన్సిల్ చేసుకున్న వారికి రీ పేమెంట్ అయ్యే విధంగా చర్యలు చేపట్టలని సంబంధిత తహశీల్దార్లను ఆదేశించారు. స్పెషల్ ఇంటెన్సివ్ కింద ఎలక్షన్ మ్యాపింగ్ ఎంట్రీ త్వరగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఫారం – 6,7,8 పెండింగ్ లేకుండా చూడాలని, అదే విదంగా మరణించిన ఓటర్లను జాబితా నుండి తొలగించాలని చెప్పారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కే. సీతారామారావు, కలెక్టరేట్ పరిపాలనాధికారి సుదర్శన్ రెడ్డి, సూపర్డెంట్లు సాయిగౌడ్, శ్రీలత, సంతోష్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# బడ్జెట్ లో పేదల సంక్షేమాన్ని విస్మరించిన రాష్ట్ర ప్రభుత్వం

**పెన్ పహాడ్. మార్చి 26. మన సాక్షి:**



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రజా పాలన బడ్జెట్ లో పేదల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. బుధవారం నాడు పెన్ పహాడ్ మండల కేంద్రంలో జరిగిన సిపిఎం మండల కమిటి సమావేశం లో ఆయన మాట్లాడుతూ మూడు లక్షల కోట్ల రూపాయల బడ్జెట్ లో పేద ప్రజలకు మొండి చెయ్యి రేవంత్ రెడ్డి ప్రభుత్వం చూపించిందని నెమ్మాది విమర్శించారు. ఇప్పటికే లోటు బడ్జెట్ తో అప్పుల ఊబిలో కుంగిన ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులు మాత్రం ఘనంగా ఉన్నాయన్నారు. కొత్తగా ఎన్నికైన గ్రామ పంచాయతీ సర్పంచులు అరకొరగా మంజూరు చేసిన నిధులు పాత అప్పుల కింద కార్యదర్శులు డ్రా చేసుకుంటున్నారని నెమ్మాది అన్నారు. ఇప్పటికీ అనేక గ్రామాల్లో త్రాగు నీటి సమస్య ఉందని, ముఖ్యంగా రానున్న వేసవిలో నీటి ఎద్దడి ఏర్పాటుతుందని గ్రామ పంచాయతీ లకు ప్రత్యేక నిధులు విడుదల చేయాలన్నారు. ఎస్ ఆర్ ఎస్ పి రెండవ దశ ద్వారా చివరి ఆయకట్టు వరకు పంట నీరు వస్తుందనీ సాగు చేసుకున్న రైతులు గత ఏడాది మాదిరిగానే పశువుల మేతకు ఎకరానికి రెండు వేల రూపాయల కు అమ్ముకుంటున్నారని దీంతో ఎకరానికి ముప్పది వేల రూపాయలు పేద రైతులు నష్ట పోతున్నారని నెమ్మాది ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు, మంచి నీటి సదుపాయాలు, ఉపాధి హామీ చట్టాన్ని కాపాడటం,అంతర్గత రహదారుల నిర్మాణం కోసం సిపిఎం ఆధ్వర్యం లో సూర్యాపేట జిల్లా కలెక్టర్ కార్యాలయం వందలాది మంది తో ముట్టడి చేస్తున్నామని ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని నెమ్మాది కోరారు. ఈ సమావేశానికి గుర్రం గోపాల్ రెడ్డి అధ్యక్షత వహించగా సీపీఎం మండల కార్యదర్శి గుంజా వెంకటేశ్వర్లు, జిల్లా కమిటి సభ్యులు ధనియాకుల శ్రీకాంత్ వర్మ, రణపంగ కృష్ణా, మడ్డి అంజిబాబు, నెమ్మాది లక్ష్మి లు హాజరయ్యారు.

# జయమ్మకు శివంగి ఉమెన్ పవర్' పురస్కారం

**పెన్‌పహాడ్, మార్చి 26 మన సాక్షి:**




మహిళా శక్తికి మరియు పట్టుదలకు నిదర్శనంగా మండల పరిధిలోని సింగారెడ్డి పాలెం గ్రామానికి చెందిన కొండ జయమ్మ ప్రతిష్టాత్మక పురస్కారాన్ని అందుకు న్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో 'పీపుల్ మీడియా పాయింట్' ఆధ్వర్యంలో నిర్వహించిన "మహిళకు వందనం" కార్యక్రమంలో ఆమెకు "శివంగి ఉమెన్ పవర్ ఆత్మీయ పురస్కారం–2026" ప్రదానం చేశారు. రియల్ ఎస్టేట్ రంగంలో ఆమె కనబరిచిన అసాధారణ ప్రతిభకు గుర్తింపుగా ఈ అవార్డు దక్కింది. ఈ సందర్భంగా జయమ్మ మాట్లాడుతూ.. తన ఎదుగుదలకు మహాదేవ్ ఇన్ఫ్రా డెవలపర్స్ ఎండీ పర్వతం అశోక్ అందించిన ప్రోత్సాహం మరువలేనిదని కొనియాడారు. ఒక సామాన్య మహిళగా ఉన్న తనను గుర్తించి, సరైన మార్గదర్శకత్వం చేస్తూ ఈ స్థాయికి చేర్చిన అశోక్ కి ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మహాదేవ్ ఇన్ఫ్రా ఎండీ పర్వతం అశోక్ స్పందిస్తూ.. జయమ్మ కనబరిచిన పట్టుదల ఇతర మహిళలకు ఎంతో స్ఫూర్తిదాయకమని అభినందించారు. ఈ వేడుకలో పలువురు ప్రముఖులు పాల్గొని జయమ్మను ఘనంగా సత్కరించారు. రిటైర్డ్ సర్వేయర్ కొండా నర్సయ్య ధర్మపత్ని అయిన జయమ్మ ఈ పురస్కారం అందుకోవడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# మన ఊరు, మన అభివృద్ధి, మన బాధ్యత



**చింతపల్లి. మార్చి 26 మనసాక్షి..**

పార్టీలకు అతీతంగా గ్రామ అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్దామని మల్లాడి పల్లి గ్రామ సర్పంచ్ నల్ల సుమిత రఘుమారెడ్డి అన్నారు. గురువారం చింతపల్లి మండల పరిధిలోని మల్లారెడ్డి పల్లి గ్రామంలో స్థానిక సర్పంచ్ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో త్రాగునీటి సమస్య పై ,వీధి దీపాలపై.పారిశు ధ్యం పై, వీధిలైట్లు విద్యుత్ సమస్యపై గ్రామ పంచాయతీ ఆదాయ వ్యయాలపై చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాట్లాడుతూ గ్రామానికి ఇప్పుడు 50లక్షల రూపాయలతో ఇంటర్నల్ సీసీ రోడ్స్ రావడం జరిగిందని అదేవిధంగా 30లక్షల రూపాయలతో రైతులు ధాన్యం నిల్వచేయడానికి వ్యవసాయ గోదాం రావడం జరిగింది అని వివరించారు. అనేక అభివృద్ధి పనులను తీసుకు రావడానికి నా సాయశక్తుల కృషి చేస్తానని. మరియు గ్రామనికి అధిక నిధులు తీసుకొచ్చి అభివృద్ధి పథంలో కి తెచ్చి ఆదర్శశీగ గ్రామంగా తీర్చి దిద్దుతానని వారు పేర్కొన్నారు.. గ్రామం లో ఎటువంటి సమస్య ఉన్న తన దృష్టి కి తీసుకురావాలి గ్రామ ప్రజలకు సూచించారు. వేసవికాలం మొదలైంది కాబట్టి నీటి సరఫరా విషయంలో ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలని సూచించారు. అనంతరంఅంగన్వాడీ కేంద్రం లో అక్షర బ్యాసం చేయడం జరిగింది.ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు కొద్దీ రోజులలో పరీక్ష లు ఉన్నందున విద్యార్థుల కు నల్ల సుమితా రఘుమారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పరీక్ష ప్యాడ్స్ , పెన్సిల్, కం బాక్స్ లు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి పెద్ద పీట వేస్తుంది అందులో భాగంగా వ్యవసాయ పనిముట్లు సబ్సిడీ లో 3రొటీవేటర్లు మన గ్రామానికి రావడం జరిగింది. అందులో గ్రామానికి చెందిన శిరసన గండ్ల శ్రీరాములు కి సర్పంచ్ చేతుల మీదుగా అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నల్ల రఘుమారెడ్డి , డీసీసీ ప్రధాన కార్యదర్శి ఎరుకల వెంకటయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# బాలల చట్టాలపై అవగాహన


**పెన్ పహాడ్ మార్చి 26 మన సాక్షి :**



గ్రామంలో బాలల పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని గ్రామ సర్పంచ్ వగ్గు రవి బాలల పరిరక్షణ విభాగం , సోషల్ వర్కర్ వి. శ్రీలక్ష్మి అన్నారు . గురువారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా జిల్లా బాలల పరిరక్షణ విభాగం, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ మిషన్ వాత్సల్య పథకం ,బాలల చట్టాలపై గ్రామ సర్పంచ్ ఒగ్గు రవి అధ్యక్షతన అవగాహన కల్పించి వివిధ శాఖల తో గ్రామస్థాయి బాలల పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్యవివాహాల నిర్మూలన, బాలలపై లైంగిక వేధింపులు నివారణ, బాలల దత్తత విధానం, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, అనాధ బాలల పరిరక్షణ, చట్టాలపై అవగాహన కల్పించారు బాలలపై వేధింపులు దాడులు, అక్రమ రవాణా నిర్మూలన, జరిగినప్పుడు వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ 1098, సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ప్రధానోపాధ్యాయులు ఎన్ రవి, గ్రామ ఉపసర్పంచ్ గుండెబోయిన జానయ్య,, ఐసిడిఎస్ సూపర్వైజర్ స్వప్న, పంచాయతీ కార్యదర్శి జి నాగరాజు,చైల్డ్ లైన్ కేస్ వర్కర్ డి కిరణ్, ప్రధానోపాధ్యాయులు సునీత, ఎయిడ్ఎస్జీవో మండల కమిటీ సోషల్ మొబిలైజర్ ఒగ్గు సోమన్న, ఏఎన్ఎం వీరమ్మ, ,సంఘ బంధం అధ్యక్షురాలు ఆర్. విజయలక్ష్మి, అంగన్వాడి కార్యకర్తలు గుండెపునేని ఊర్మిళ, దాసరి విజయ , వార్డు సభ్యులు ఒగ్గు వెంకటమ్మ, సన్నాయిల సైదులు, ఒగ్గు విక్రమ్, వివో ఏలు చెనగాని మమత, వెన్నసరిత, యూత్ సభ్యులు నిమ్మల మల్లేష్, రిటైర్డ్ ఉపాధ్యాయులు రంగినేని లక్ష్మీకాంత రావు, సిఆర్పి నాగు, అధికారులు,బాలల తల్లిదండ్రులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

# మహిళల అభివృద్ధి ప్రభుత్వ ధ్యేయం

**పెన్ పహాడ్, మార్చి 26 మన సాక్షి:**



మహిళల సంఘ బంధాల మరియు తండాల గ్రామాలలో అభివృద్ధి ప్రభుత్వ ధ్యేయమని సర్పంచ్ ధారావత్ వసంత శ్రీను అన్నారు .మండల పరిధిలోని చిన్నగార కుంట తండా గ్రామ పంచాయతీ అభివృద్ధిలో నూతనంగా నిర్మించనున్న మహిళా సంఘం భవనం, అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు గ్రామ సర్పంచ్ ధరావత్ వసంత శ్రీను ఘనంగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, మహిళల ప్రతి గ్రామానికి మహిళలకు సంఘ బంధాల సమావేశం కొరకు ప్రభుత్వం సమావేశ మందిరాన్ని నూతనంగా నిర్మించడం జరుగుతుందని ప్రతి గ్రామాలలో మురుగు నిలవ ఉండకుండా డ్రైనేజీ నిర్మాణమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని సర్పంచ్ ధారావత్ వసంత శ్రీను అన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ధరావత్ శ్రీను, ఉప సర్పంచ్ బానోత్ బిక్షం, వార్డు సభ్యులు అశ్విని, నాగేష్, విజయ, సోమ్లా, సరళ, శోభ, రామోజీ నాయక్, ఉపాధ్యాయులు శైలజ, రామోజీ నాయక్, అంగన్వాడీ టీచర్లు కవిత, శ్రీదేవి, బుక్ కీపర్ నీలా, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ నీలమ్మ, ఆశా వర్కర్ లలిత, గ్రామ పెద్దలు వెంగళరావు, వినోద్ కుమార్, హుస్సేన్, కిషన్, చందర్, భీమా, నాగరాజు, గోజ్య, భాగ్య, లక్ష్మ, వెంకన్న, దసరు, బలరాం తదితరులు పాల్గొన్నారు.

# హెల్త్ క్యాంపులను సద్వినియోగపర్చుకోవాలి

**చింతపల్లి. మార్చ్ 26 మనసాక్షి**



గ్రామీణ నిరుపేద ప్రజలు ప్రభుత్వం అందించే మెగా హెల్త్ క్యాంపు లను సద్వినియోపరుచుకోవాలని గొడకొండ్ల సర్పంచ్ కాశగోని వెంకటయ్య పేర్కొన్నారు. గురువారం చింతపల్లి మండల పరిధిలోని గొడకొండ్ల (మాల్ )వీటి నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజాపాలన – ప్రభుత్వ ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ప్రజా ప్రభుత్వం ప్రణాళిక ప్రకారం జిల్లా కేంద్రం నుండి స్పెషల్ వైద్యాధికారులు డాక్టర్ సరిత, వీరితోపాటు మరికొంతమంది డాక్టర్లు విచ్చేసి మెగా హెల్త్ క్యాంపు ను నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కాశగోని వెంకటయ్య కంటి వైద్య కేంద్రాన్నివారు ప్రారంభించారు. ఈ సందర్భంగా రోగులకు పలు రకాల ఆరోగ్య వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వంశీకృష్ణ, వార్డు సభ్యులు, వైద్య సిబ్బంది, గ్రామ పెద్దలు, ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సీసీ రోడ్డు పనులు ప్రారంభం

**తుంగతుర్తి మన సాక్షి మార్చి 26.**



తుంగతుర్తి మండల పరిధిలోని బాపన్ భాయ్ తండా గ్రామములో ఎన్ ఆర్ జీ.ఎస్ నిధుల కింద ఐదు లక్షల నిధులతో సిసి రోడ్డును రెండు వార్డులకు సీసీ రోడ్డు ప్రారంభం సర్పంచ్ బికో జి. గ్రామ ప్రజలను ఉద్దేశించిమాట్లాడుతూ మా గ్రామంలో గత కొన్ని సంవత్సరాల నుండి గత పాలకుల నిర్లక్ష్యంతో వెనుకబడ్డదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నూతన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రజా పాలనలో శాసనసభ్యులు మందుల సామిల్. ఆశీస్సులతో ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి ఆశీస్సులతో గ్రామాన్ని అన్ని విధాలుగా బాగు చేస్తానని గ్రామ ప్రజలకు తెలియపరుస్తూ ఈరోజు గ్రామ ప్రజలు వీధులలో శుభ్రం చేసి నూతన సీసీ రోడ్డును ప్రారంభించమన్నారు అదేవిధంగా మా చిన్న గ్రామానికి మురికి కాలువలు వీధిలైట్లు త్రాగునీటి సమస్య లేకుండా చూస్తానని తెలిపారు. గ్రామంలోని అభివృద్ధి కార్యక్రమాలను అవసరమైన పనులను ముందుగానే గుర్తించి ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని వాటన్నిటిని పరిష్కరిస్తానని గ్రామ ప్రజలకు ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ సాయిరాం వార్డు సభ్యులు భూక్యపట్టు. లాకవతు తార.జగన్.లింగ.మహబూ బిపలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణ పై అవగాహన

**చింతపల్లి. మార్చి 26 మన సాక్షి...**




రోడ్డుపై ప్రయాణించే వాహనదారులు ప్రతి ఒక్కరు అతి జాగ్రత్తతో వాహనాలను నడిపి తన ప్రాణాలను బలి చేసుకోవద్దని చింతపల్లి ఎస్సై ముత్యాల రామ్మూర్తి పేర్కొన్నారు. గురువారం చింతపల్లి మండల కేంద్రంలోని స్థానిక ఎక్స్ రోడ్ పై ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రజలతో సమావేశమై రహదారిపై ఉన్న లైన్లను అనుసరించాలని, అరైవ్, అలైవ్ రోడ్డు భద్రత ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు ఇంటి నుండి బయలుదేరి, తిరిగి ఇంటికి చేరేవరకు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించారు, మద్యం సేవించి, ఫోన్ మాట్లాడుతూ, డ్రైవింగ్ చేయరాదని పేర్కొన్నారు.రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన చర్యలు గూర్చి ఆటో డ్రైవర్లకు వాహన డ్రైవర్లకు వివరించారు. రోడ్డుపై ప్రయాణించే ప్రతి ఒక్క వాహనదారుడు బాధ్యతాయుతంగా నడుచుకోవాలని కోరారు. ఇతర వాహనాలను ఓవర్ టెక్ చేసేటప్పుడు జాగ్రత్తగా వెళ్లాలని సూచించారు. అతివేగ వాహనాలను నడిపి ప్రాణాలను కోల్పోవద్దు అన్నారు. అదే విధంగా బైకులు స్కూటీలు లైసెన్స్ లేని చిన్న పిల్లలకు ఇవ్వకూడదన్నారు. డ్రైవింగ్ లైసెన్సులు కలిగి ఉన్న వారు మాత్రమే వాహనాలను నడపలన్నారు. లేనిచో చట్టరీత్యా కేసులు నామోదు చేయబడతాయి అన్నారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులు, ప్రజలు పోలీస్ సిబ్బంది తదితరులుఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా శ్రీ సీతారాముల కళ్యాణం



**సూర్యాపేట మార్చి 26 మనసాక్షి**

జిల్లా కేంద్రంలోని విద్యానగర్ శ్రీ రామలింగేశ్వర సహిత త్రిశక్తి అయ్యప్ప ఆంజనేయ స్వామి దేవాలయంలో గురువారం అంగరంగ వైభవంగా శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. ఈ దేవాలయంలో ప్రత్యేకత ఏమిటంటే ఆలయం కట్టిన రోజు నుండి ప్రతి సంవత్సరం అష్టమి రోజున అమ్మవారి జన్మ తిది రోజున అయోధ్యలో రాముల వారి కళ్యాణం చేసినట్లుగానే మన సూర్యాపేటలో సీతారాముల కళ్యాణం నిర్వహిస్తున్న ఆచారం.ప్రత్యేకంగా అలంకరించిన మండపాన్ని పలు పుష్పాలతో చక్కగా అలంకరించారు. మండపంలో శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఉత్సవమూర్తులను ఆసీనులు చేసి అంగరంగ వైభవంగా శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కల్యాణాన్ని మధ్యాహ్నం నిర్వహించగా విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి అమ్మవార్ల కళ్యాణాన్ని తిలకించి నేత్రానంద భరితులయ్యారు. ఈ కళ్యాణాన్ని ఆలయ ప్రధాన అర్చకులు రెంటల సతీష్ శర్మ, దుర్గాప్రసాద్, నిర్వహించారు.అనంతరం భక్తులకు కళ్యాణ అక్షతలను, తీర్థప్రసాదాలు, అన్నప్రసాదాన్ని ఆలయ నిర్వాహకులు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అనంతుల గణేష్ రామలింగయ్య, అనంతుల సూర్యనారాయణ, అనంతుల సందీప్ కుమార్, అనంతుల దుర్గాప్రసాద్, అనంతుల శ్రీనివాస్ మేనేజ్మెంట్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయాలకతీతంగా పట్టణ అభివృద్ధికి సహకరించాలి

## -ఎమ్మెల్యే భత్తుల లక్ష్మారెడ్డి




**మిర్యాలగూడ, మార్చి 26, మన సాక్షి**

రాజకీయాలకతీతంగా పట్టణా భివృద్ధి సహకరించాలని స్తానిక శాసనసభ్యులు లక్ష్మారెడ్డి కోరారు. గురువారం మిర్యాలగూడ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధా బాలకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన పురపాలక సంఘం మొదటి బడ్జెట్ సమావేశంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన మైసమ్మ తల్లి దేవాలయం దర్శించుకొని అనంతరం సమావేశంలోఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన మున్సిపాలిటీ కౌన్సిల్ ఏర్పాటు అయిన తర్వాత



ఏర్పాటు చేసిన మొదటి బడ్జెట్ సమావేశం కావున కౌన్సిలర్స్ అందరూ పార్టీలకు రాజకీయాలకు అతీతంగా పట్టణ అభివృద్ధిలో భాగస్వాములు అవ్వాలని పిలుపునిచ్చారు. విమర్శలకు, విబేధాలకి తావులేకుండా సామరస్యంగా అందరూ కలిసి పనిచేయాలి అని అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, కౌన్సిలర్లు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట

## మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

### జూనియర్ కళాశాల నిర్మాణం పనులకు శంకుస్థాపన

**కనగల్ మార్చి 26, మన సాక్షి:**

విద్యా రంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. గురువారం నల్గొండ జిల్లా, కనగల్ మండల కేంద్రంలో రూ. 6 కోట్లతో నిర్మించనున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ చదువుతోనే కుటుంబాలు బాగుపడతాయని ,అభివృద్ధి సాధ్యమని, అందువల్ల ప్రతి ఒక్కరు తప్పకుండా పిల్లలను చదివించాలని కోరారు. తమ ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని, ఇందులో భాగంగా ప్రతి నియోజకవర్గంలో రూ. 200 కోట్లతో అన్ని ఆధునిక సౌకర్యాలతో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మిస్తుందని వివరించారు. కనగల్ లో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల చుట్టుపక్కల గ్రామాల విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని, రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యార్థుల మాదిరిగానే ఇంటర్ విద్యార్థులకు కూడా వచ్చే విద్యా సంవత్సరం నుండి ఉదయం అల్పాహారంతో పాటు, మధ్యాహ్న భోజనం అందించనుందని, అందువల్ల తప్పనిసరిగా పిల్లలను కళాశాలకు పంపించాలని ఆయన కోరారు. నల్గొండ జిల్లా కేంద్రంలో రూ. 150 కోట్లతో ప్రభుత్వ వైద్య కళాశాలను నిర్మించామని, అలాగే నర్సింగ్ కళాశాల నిర్మాణం డిసెంబర్ లోపు పూర్తి చేస్తామని,



చదువుకున్న నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడంలో భాగంగా రూ. 20 కోట్లతో న్యాక్ బిల్డింగ్ నిర్మించి మొదటి అంతస్తు పూర్తి చేశామని, అక్కడ మహిళలకు కూడా శిక్షణ ఇస్తున్నామని, సెట్విన్ ద్వారా 2500 మంది మహిళలకు వివిధ రకాల శిక్షణ కార్యక్రమాలు ఇస్తున్నామని, అంతేకాక 80 కోట్ల రూపాయల వ్యయంతో ఏటీసీ కేంద్రాన్ని నిర్మించడం జరిగిందని, వీటన్నిటి ద్వారా చదువుకున్న యువత స్వయం ఉపాధి పొందవచ్చని మంత్రి తెలిపారు. కనగల్ చౌరస్తా నుండి కనగల్ గ్రామం వరకు అసంపూర్తిగా ఉన్న రహదారి విస్తరణ రూ. 8 కోట్లు మంజూరు చేసామని, శుక్రవారం నుండి పనులు ప్రారంభమవుతున్నాయని, అలాగే రేగట్ట వరకు రూ. 60 కోట్లతో డబుల్ రోడ్డు నిర్మాణం, పగిడిమర్రి మీదుగా మరో రోడ్డు, ముషంపల్లి వరకు రూ.100 కోట్లతో రోడ్డును మంజూరు చేసినట్లు వెల్లడించారు. కనగల్ -- నల్గొండ మధ్య పరిశ్రమలను ఏర్పాటు చేసి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, కోటి 20 లక్షల రూపాయలతో కనగల్ మండల కేంద్రంలో గోడౌన్ ఏర్పాటు చేస్తున్నామని, మరో రూ.16 కోట్లతో షెడ్ నిర్మిస్తున్నామని, ఏప్రిల్ మొదటి వారంలో కనగల్ లో నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించి కనగల్ అభివృద్ధికి అవసరమైన చర్యలపై సమీక్షిస్తామని మంత్రి తెలిపారు. అంతకుముందు మంత్రి ధర్వేశిపురంలో శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు మహిళలకు కళ్యాణ లక్ష్మి చెక్కులను మంత్రి కోమటిరెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు శంకర్ నాయక్, కలెక్టర్ బి. చంద్రశేఖర్, ఆర్డిఓ వై .అశోక్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకురి రమేష్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి దశ్రు నాయక్, కొనగల్ మాజీ జెడ్పిటిసి నర్సింగ్ శ్రీనివాస్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు గడ్డం అనూప్ రెడ్డి, స్థానిక సర్పంచ్ నర్సింగ్ మురలీధర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ఆరు గ్యారెటీలకు చట్టబద్ధత కల్పించాలి

**తుంగతుర్తి మన సాక్షి మార్చి 26.**

తుంగతుర్తి మండల పరిధిలోని అన్నారం గ్రామంలో బి.ఆర్.ఎస్. మండలపార్టీఅధ్యక్షుడు తాటికొండ సీతయ్య. మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు అభయహస్తం పేరుతో హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలకు ప్రస్తుత అసెంబ్లీబడ్జెట్ సమావేశాల్లో చట్ట బద్ధత కల్పించాలని డిమాండ్ చేసారు. తుంగతుర్తి మండలం అన్నారం గ్రామంలో టిఆర్ఎస్.గ్రామశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమం లో ఎన్నికలముందు మహిళలకు 2500. వికలాంగులకు 6000. వృద్ధులకు.4000.రైతులకు 15000వేలు. నిరుద్యోగభృతి . విద్యార్థులకు విద్యాభరోస కార్డు. నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని మోసపూరిత మాటలు చెప్పి అధికారానికి వచ్చిరెండున్నరెండ్లు అవుతున్న ఒక్కటి నెరవేర్చ లేదని అన్నారు. అధికారం లోకి రాగానే చట్ట బద్ధత కల్పిస్తామని చెప్పిన మాటలు మరిచిపోయిన ప్రభుత్వానికి ప్రతిపక్ష హోదాలో అసెంబ్లీ లో ప్రవేశ పెట్టబోయే ప్రైవేట్ మంబర్ బిల్లు కు ప్రభుత్వం మద్దతివ్వాలని అన్నారు.. ఏప్రిల్ నెలాఖరు వరకు కాల్వల్లో నీళ్లు ఇవ్వాలని నోటికాడికి వచ్చిన వరిపంట



ఎండిపోకుండా రైతాంగాన్ని కాపాడాలని. రైతు భరోసా వాయిదా పద్ధతుల్లో కాకుండా ఎకరానికి ఆరువేల చొప్పున యాసంగి పంట డబ్బులను ఒకేసారి ఇవ్వాలని అన్నారు. యాసంగి పంటకు ఇవ్వాల్సింది ఇవ్వకుండా కొత్తలప్పుడు వాయిదాలప్రాకారమివ్వడమంటే ఈ పేరుతో వచ్చే వానకాలం భరోసా ఎగ్గొట్టేందుకు ప్రభుత్వం ఎత్తుగడ చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు గుండగాని రాములు గౌడ్ మండల నాయకులు దొంగరి శ్రీనివాస్. సర్పంచ్ శ్రీనివాసరెడ్డి. నాయకులు. మట్టిపెల్లి వెంకట్. మన్నూరు పోతరాజు. ఇసాకర్. సతీష్. బెడద రాములు. మాజీ సర్పంచ్ సోమశేఖర్. సైదులు. సరిత. బింగివెంకన్న మహేష్. తదితరులు పాల్గొన్నారు.

# రైతు సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి

**నల్లగొండ మార్చి 26 మనసాక్షి.**

రైతు సమస్యలపై నల్లగొండ జిల్లా బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షులు గడ్డం వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కు మెమోరాండం సమర్పించారు. ముఖ్యంగా రైతు భరోసాను పూర్తిస్థాయిలో అమలు చేయాలని అలాగే పెండింగ్ లో ఉన్న రైతు భరోసా డబ్బులు కూడ వెంటనే రైతుల ఖాతాల్లో జమ చెయ్యాలని, వరి కోతలు ప్రారంభం కానున్నందున ఏప్రిల్ నెలలోనే ఐకెపి సెంటర్లు ప్రారంభించాలని, పెండింగ్ లో ఉన్న బోనస్ డబ్బులు వెంటనే రైతుల ఖాతాల్లో జమ చెయ్యాలని, ఫామాయిల్ ఫ్యాక్టరీ పనులు సత్వరమే పూర్తి చెయ్యాలని అలాగే వి బి జి రాంజీ పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చెయ్యాలని మెమోరాండం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధి గా కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు బస్వా లక్ష్మీ నర్సయ్య ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు నాగం వర్షిత్ రెడ్డి, కిసాన్ మోర్చా జాతీయ నాయకులు, గోలి మధుసూదన్ రెడ్డి బీజేపీ సెంట్రల్ హైదరాబాద్ జిల్లా ఇంచార్జ్ వీరెల్లి చంద్రశేఖర్ బీజేపీ



రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాదగోని శ్రీనివాస్ గౌడ్ రాష్ట్ర భూ నిర్వాసితుల సెల్ కన్వీనర్ భవనం మధుసూదన్ రెడ్డి కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్ మోహన్ రెడ్డికిసాన్ మోర్చా రాష్ట్ర కోశాధికారి కన్మత రెడ్డి అశోక్ రెడ్డి బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతేపాక లింగస్వామి, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గుండా నవీన్ రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, మిరియాల వెంకటేశం , బీపంగి జగ్జీవన్ ,పిండి పాపిరెడ్డి,మహిళా మోర్చా అధ్యక్షురాలు రావెళ్ల కాశమ్మ కిసాన్ మోర్చా సీనియర్ నాయకురాలు ఇరిగి చిలకమ్మ తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ బిల్లుల కోసం మాజీ సర్పంచుల పోరుబాట

**గుర్రంపోడు, మార్చి 26, మన సాక్షి:**

గ్రామాల్లో అభివృద్ధి పనులు పూర్తి చేసినా ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నల్గొండ జిల్లా గుర్రంపోడు మండల కేంద్రంలో మాజీ సర్పంచులు పోరుబాట పట్టారు. గురువారం మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన మాజీ ప్రజాప్రతినిధులు స్థానిక ఎంపీడీవో కార్యాలయం ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల తాము ఆర్థికంగా చితికిపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచులు మాట్లాడుతూ.. 2019 నుంచి 2024 వరకు తాము పదవిలో ఉన్న సమయంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల అభివృద్ధి కోసం అప్పులు తెచ్చి మరి పనులు పూర్తి చేశామని తెలిపారు. వైకుంఠధామాలు, సిసి రోడ్లు, డ్రైనేజీ వంటి పనులను సొంత నిధులతో పూర్తి చేసినా, నేటికీ ప్రభుత్వం నుండి రావాల్సిన బకాయిలు అందడం లేదని మండిపడ్డారు. గతంలో చేసిన పనులకు సంబంధించి ప్రభుత్వం నిధులు విడుదల చేసినప్పటికీ, ప్రస్తుతం గుర్రంపోడు మండలంలో ఇన్-ఛార్జ్‌గా ఉన్న ఎంపీడీవో ఆ నిధులను కావాలనే అడ్డుకుంటున్నారని వారు నేరుగా



ఆరోపించారు. రికార్డులను క్లియర్ చేయడంలో అధికారులు జాప్యం చేయడం వల్ల తాము తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక రోడ్డున పడే పరిస్థితి వచ్చిందని కన్నీటి పర్యంతమయ్యారు. ఈ నిరసన కార్యక్రమంలో మాజీ సర్పంచులు ఎస్కే సయ్యద్ మియా, నరసింహ, మదర్ షా, అశోకు, బాల మల్లయ్య, కేసాని యాదగిరి రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కట్టెబోయిన విజయ్, పాల్వాయి శ్రీను, మర్రి సైదులు, బద్రి యాదయ్య, కే జగదీశ్వర్ రెడ్డి, కృష్ణ ప్రసాద్, లింగారెడ్డి, చల్లమల్ల ప్రతాప్ రెడ్డి, ఎరుకల రామలింగం తదితరులు పాల్గొన్నారు. ఇప్పటికైనా నల్గొండ జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపి, తమకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించేలా చూడాలని వారు విజ్ఞప్తి చేశారు. అధికారులు స్పందించి తమ సమస్యను పరిష్కరించని పక్షంలో, రాబోయే రోజుల్లో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు.

# భద్రత నియమాలు పాటిస్తూ వాహనాలు నడపాలి

**తుంగతుర్తి మన సాక్షి మార్చి 26.**



తుంగతుర్తి పట్టణంలోని మెయిన్ రోడ్డుపై వాహనదారులకు మండల ప్రజలకురోడ్లపై ఉన్న లైన్ లను అనుసరించాలి అని తుగతుర్థి ఎస్ఐ క్రాంతి కుమార్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో జాతీయ రహదారిపై అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించి ప్రయాణికులకు, ఆటో డ్రైవర్లకు, స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి డ్రైవర్లకు వివరించారు. రోడ్డు ప్రయాణ సమయంలో ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటించడం ద్వారానే ప్రమాదాలు నివారించవచ్చునని తెలిపారు. రోడ్డుపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ బాధ్యతగా నడుచుకోవాలని రోడ్డు నియమ నిబంధనలను పాటించాలని కోరారు. ఇతర వాహనాలను ఓవర్ టేక్ చేసేటప్పుడు జాగ్రత్తగా వెళ్ళాలి, అతి వేగంగా వాహనాలు నడపవద్దు అని కోరారు. వాహనాలు నడిపేవారు త్రిబుల్ రైడింగ్ తో వెళ్లొద్దని డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నవారు మాత్రమే వాహనాలు నడపాలని లేనియెడల చట్టరీ చర్యలు తప్పవని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో పట్టణ ప్రజలు ఆటో డ్రైవర్లు ద్విచక్ర వాహనదారులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# బాలల పరిరక్షణ మనందరి బాధ్యత

**చింత పల్లి. మార్చి 26 మన సాక్షి..**

బాలల పరిరక్షణ మనందరి బాధ్యతని తీదేడు గ్రామ సర్పంచ్ గ్రామ బాలల పరిరక్షణ కమిటీ ఛైర్మన్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి అన్నారు.గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో జిల్లా బాలల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...బాల బాలికలను అన్ని రంగాలలో ప్రోత్సహించడానికి ప్రతి ఒక్కరు సహకరించాలని ఆమె అన్నారు.బాల్య వివాహాలు జరుగకుండా ప్రతి ఒక్కరు



చర్యలు తీసుకోవాలన్నారు ..బాలలందరు బడికి వెళ్ళేలా,బాల కార్మికులు లేకుండా,బాలలపై ఎలాంటి వేధింపులు జరుగకుండా ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకోవాలని తెలిపారు.బాలల సంక్షేమ కోసం ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఇడబోయిన వెంకటయ్య యాదవ్,మాజీ ఉప సర్పంచ్లు ధరణిపతి రమణారావు, ఉలుపాల శేఖర్ రెడ్డి,సోనగంటి గోవర్ధనాచారి,వార్డు సభ్యులు బొడ్డు పార్వతమ్మ యాదగిరి,మాదగోని కృష్ణ గౌడ్, గంటెల అలివేలు సోమయ్య, దాసరి కళమ్మ ముత్తయ్య, రెడ్డి పద్మ పరమేష్,సందె లక్ష్మయ్య,మర్ల యాదగిరి,ఐ.సి.పి.యస్ సభ్యులు రాము,అంగన్వాడి సూపర్వైజర్ ప్రసన్న లక్ష్మి,అంగన్వాడి టీచర్లు, ఆశావర్కర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# యువకుడు ఆత్మహత్య

**మిర్యాలగూడ మార్చి 26, మన సాక్షి:**



మిర్యాలగూడ మండలంలోని యాదిగిరి పల్లి గ్రామంలో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం జరిగింది. రూరల్ ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం..యాదగిరి పల్లి గ్రామానికి చెందిన పొదిల ఆనంద్ (29) ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. గురువారం ఉదయం 6 సమయంలో నిద్ర లేచిన అనంతరం ఇంట్లో తిరుగుతూ తన తల్లి అతన్ని ఫ్రెష్ అప్ అయ్యి టిఫిన్ చేయడానికి రమ్మనగా, అతను ఎటువంటి కారణం లేకుండా ఇంటి బెడ్ రూమ్ లోకి వెళ్లి తలుపులు పెట్టుకుని లోపల నుంచి గడియ వేసుకొని చీరతో సీలింగ్ ఫ్యాన్ కు ఉరివేసుకొని ఆత్మహత్య కు పాల్పడినాడు. ఇట్టి విషయమై మృతుని యొక్క తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించడమైనది.

Edited, Printed, Published and Owned by MALLE NAGI REDDY Printed at LAXMI PUBLICATIONS H.No. 28-891/9, Journalist Colony, Chinthapally X Road, Miryalagda, Dist: Nalgonda-508207, Telangana.and Published at H.no.. 28 - 891/9, Chinthapally Bypass X Road, Miryalagda, Dist: Nalgonda-508207, Telangana."Editor: MALLE NAGI REDDY. RNI NO. TELTEL/2022/83470. Cell: 9666924232. gmail Id: manasakshi.in@gmail.com.